జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php

కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవ్వరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 297 విశాఖపట్నం శనివారం 24 జూన్2023 8 పేజీలు వెల : 5.00

## ప్రజలకు మంచి చేయడం కోసమే..

# జగనన్న సురక్ష

### జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం జగన్



అమరావతి: ప్రజలకు మంచి చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం జగన్ తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి మాట్లాడుతూ వివిధ కారణాలతో మిగిలిపోయిన లబ్ధిదారులకు మంచి చేయడమే జగనన్న సురక్ష అన్నారు. ఏ కారణం చేతనైన అర్హత ఉండి మిగిలిపోయిన వారికి లబ్ధి చేకూరుస్తామన్నారు. రాష్ట్రంలో 600 రకాల పౌరసేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు అర్హులందరికీ అందాలన్నారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమమే జగనన్న సురక్ష అన్నారు. నవరత్నాల ద్వారా రూ. 2లక్షల 16వేల కోట్లు అందించామన్నారు. ఎక్కడా లంచాలకు తావులేకుండా పారదర్శకంగా పాలన అందిస్తున్నామన్నారు. నేరుగా బటన్ నొక్కి అక్కా చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశామన్నారు. సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యమన్నారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహణ ఉంటుందన్నారు. రేపటి నుంచి గృహాల సందర్శన ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.6 కోట్ల కుటుంబాలను బృందాలు సందర్శించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సురక్ష క్యాంపుల నిర్వహణ ఉంటుందన్నారు. '1902'తో హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపన, తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం.. అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ఈ జగనన్న సురక్ష ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టనుందన్నారు. తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికింకేమైనా సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హెల్డ్ డివిజన్, ఇన్కమ్ మొదలైన 11 రకాలు ధ్రువీకరణ పత్రాలు) అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా వాటిని ఉచితంగా అందించనుందన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలకు, వివక్షకు తావు లేకుండా.. నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. (మిగతా 2లో..)

# నకిలీ విత్తనాల జోరు..



అమరావతి, : వ్యవసాయ సీజను ప్రారంభం కాకముందే నకిలీ విత్తనాలు మార్కెట్ లో విజృంభించాయి. గతేడాది పత్తికి రైతులు ఆశించిన ధర కంటే మించి వుండడంతో ఈ సంవత్సరం పత్తి సాగు పై మొగ్గు చూపారు. దీన్ని ఆసరాగా చేసుకున్న విక్రేతలు పొరుగు రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అమ్ముతున్నా రు. రాష్ట్రంలో ప్రధానంగా పత్తి విత్తనాల విక్రయా లకు గుంటూరు జిల్లా కేంద్రంగా వుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రైతులు కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో భూములు కౌలుకు తీసుకుని ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. కంపెనీలకు విత్తనాలు పండించే క్రమంలో దిగుబడి వచ్చినవన్నీ వారికి ఇవ్వకుండా కొన్ని మిగుల్చుకుని ఇక్కడి వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల రైతులతో గుంటూరు జిల్లా వాసులకు సంబంధాలు ఉన్నాయి. ఈ వ్యాపారాన్ని కొందరు వృత్తిగా మార్చుకుని ఏటా సీజన్లో క్రయవిక్రయాలు చేస్తున్నారు. తెలిసిన వారు కావడం, మార్కెట్ కంటే తక్కువ ధరకు వస్తుండడంతో రైతులు కూడా కొనుగోలు చేస్తున్నా రు. ఇక్కడితో ఆగిపోకుండా వ్యాపారాన్ని విస్తరించే క్రమంలో వివిధ కంపెనీల పేర్లతో సంచులు తయారు చేయించి వాటిలో నింపి మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణలో కొంతమందితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. అనుమతి లేని విత్తనాలు పెద్దఎత్తున రవాణా చేస్తుండగా తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది. నకిలీ విత్తనాల అక్రమ రవాణా ప్రధానంగా పార్సిల్ సర్వీసులు, ఆర్టీసీ, ప్రయివేటు- బస్సులు కార్గో సర్వీసులు, కొరియర్ సర్వీసుల ద్వారా జరుగుతుంది. (మిగతా 2లో..)

# తిరుమలలో 5ఏళ్ల చిన్నారిపై చిరుత దాడి..

### అలిపిరి నడక మార్గంలో ఘటన..



తిరుమల: తిరుమలలో చిన్నారిపై చిరుత దాడి చేసింది. ఈ ఘటన అలిపిరి నడక మార్గలంలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఐదేళ్ల బాలుడు కౌశిక్పై చిరుత దాడి చేసింది. తన తాతతో కలిసి వెళ్తున్న సమయంలో బాలుడిపై ఈ దాడి జరిగింది. బాలుడిని నోట కరచుకుని పొదల్లోకి లాక్కెళ్లేందుకు చిరుత ప్రయత్నించగా, పక్కనే ఉన్న భక్తులు, పోలీసులు గట్టిగా కేకులు వేస్తూ వెంటపడ్డారు. దీంతో చిరుత భయంతో బాలుడిని అక్కడే వదిలేసి వెళ్లింది. ఈ దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ వెంటనే భద్రతా సిబ్బంది బాలుడిని తిరుపతి స్విమ్స్కు తరలించారు. విషయం తెలుసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి ఘటనాస్థలికి చేరుకున్నారు. దాడి జరిగిన ప్రాంతంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని, బాలుడికి మెరుగైన చికిత్స అందించేలా చూస్తామని ఈవో వెల్లడించారు. అలిపిరి నడక మార్గంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

## విపక్ష నేతలపై ఈడీ, సీబీఐలను ఉసిగొల్పుతున్న మోదీ సర్కార్ : దీదీ



పట్నా : బిహార్ సీఎం నితీష్ కుమార్ అధ్యక్షతన పట్నాలో శుక్రవారం జరిగిన విపక్ష నేతల సమావేశం ముగిసిన అనంతరం పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న లోక్సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా విపక్ష పార్టీలన్నీ ఏకమై పోరాడతాయని స్పష్టం చేశారు. పట్నా నుంచి చరిత్ర మొదలవుతుందని, చరిత్ర తిరగరాయాలని కోరకుంటున్న కాషాయ పార్టీకి బుద్ధిచెబుతామని అన్నారు. ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తాలన్నదే తమ ధ్యేయమని, తామూ భారత్ మాత అంటామని, తమను ప్రతిపక్షమని పిలవకూడదని దీదీ పేర్కొన్నారు. మణిపూర్ తల్లడిల్లితే తాము బాధపడ్డామని అన్నారు. రాజ్భవన్ను కేంద్రం ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా మార్చిందని, కేంద్రంపై గళమెత్తిన వారిపై ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని సర్కార్పై విమర్శలు గుప్పించే రాజకీయ పార్టీలపై ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్రం ఉసిగొల్పుతోందని దుయ్యబట్టారు. ఇక విపక్ష నేతల భేటీ సామరస్య వాతావరణంలో జరిగిందని బిహార్ సీఎం, జేడీయూ నేత నితీష్ కుమార్ పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పాలక బీజేపీకి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడాలని నిర్ణయించిందని చెప్పారు. త్వరలో మరోసారి విపక్ష నేతలంతా ఒకే వేదికపై చర్చిస్తారని నితీష్ కుమార్ వెల్లడించారు.

## బిహార్లో గెలిస్తే దేశమంతటా కాంగ్రెస్ పునరుత్తేజం : మల్లికార్జున్ ఖర్గే



పట్నా : బిహార్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే దేశవ్యాప్తంగా పార్టీ పునరుత్తేజానికి దోహదం చేస్తుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం సదకత్ ఆశ్రమ్లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడారు. దేశం కోసం, దేశ ప్రజాస్వామ్య కోసం ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన కార్యక్రమాన్ని మనం ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ తాము సామాన్యుడి వెన్నంట నిలిస్తే బీజేపీ మాత్రం కేవలం ఇద్దరు ముగ్గురు అత్యంత సంపన్నులు, బడా పారిశ్రామికవేత్తలకే మేలు చేస్తోందని మండిపడ్డారు. త్వరలో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ఘఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, బీజేపీ తమ దరిదాపుల్లోకి రాదని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఇక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందించేందుకు బిహార్ సీఎం నితీష్ కుమార్ నివాసంలో విపక్ష నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, శివసేన నేతలు (యూబీటీ) ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ సహా పలువురు విపక్ష నేతలు హాజరయ్యారు.

# జనసేనానికి ముద్రగడ ఓపెన్ ఛాలెంజ్..

### పిఠాపురంలో తనపై పోటీకి రావాలని పవన్కు పిలుపు



అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు మాజీ ఎంపీ కాపు నేత ముద్రగడ పద్మనాభం సోషల్ మీడియా వేదికగా మరో లేఖను రాశారు. మూడు పేజీల లేఖలో అనేక అంశాలను ప్రస్తావిస్తూనే జనసేనానికి ముద్రగడ పద్మనాభం ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. దమ్ముంటే పిఠాపురంలో తనపై పోటీచేయ్ అని ముద్రగడ సవాల్ విసిరారు. కాకినాడ ఎమ్మెల్యే తో పాటు నన్ను కూడా తిట్టడం మీ దృష్టిలో తప్పో రైటో గ్రహించాలన్నారు. నన్ను మీరు తిట్టడం వల్లే సమాధానంగా లేఖ రాశాను.. మీరు అభిమానుల చేత బండబూతులతో మెసేజ్లు పెట్టిస్తున్నారు. మీ అభిమానులు పెట్టే మెసేజ్ లకి నేను భయపడి పోయి నేను లొంగి పోతాను అనుకుంటున్నారేమో అలా ఈ జన్మకు జరగదని చెప్పారు. మీరు సినిమాలో హీరో తప్ప రాజకీయాల్లో హీరో కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు నేను మీ దగ్గర నౌకరీ చేయడం లేదు.. నేను నా సొంత అభిప్రాయాన్ని వ్యక్తం చేయవద్దా అసలు.. నాకు మీకు ఉన్న సంబంధం ఏమిటి.. మీకు డబ్బు ఉంది కనుక నన్ను మీ అభిమానులతో తిట్టిస్తారా అంటూ ప్రశ్నించారు. అప్పట్లో వంగవీటి రంగా ను హత్య చేసిన సమయంలో ఎంతో మంచి అమాయకులు జైల్లో ఉన్నారని.. అప్పుడు మీరు జైలుకు వెళ్లి ఎవరినైనా పలకరించారా.. 2016 లో తుని సభ తరువాత కేసులో ఉన్నవారిని ఎప్పుడైనా పలకరించారా అంటూ పవన్ ను ప్రశ్నించారు ముద్రగడ.



# జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ అధికారులు

విశాఖపట్నం, ప్రజా పాలన ప్రతినిధి జూన్ 23 :'జగనన్న సురక్ష' రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున , జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ , నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ జగనన్న సురక్ష కార్యక్రమం అమలు పై ఎమ్మార్వోలు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీఇంటికీ సంక్షేమ పథకాలను అందించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.దీనిలో భాగంగా జిల్లాలో నేటినుంచీ జులై 23 వరకే





జరిగే ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారని, ఎవరైనా అర్హులు సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోయి ఉంటే, వారికి కూడా పథకాలను వర్తింప జేస్తారని తెలిపారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సురక్ష కార్యక్రమంలో వారి సమస్యలను, మండల, పురపాలక స్థాయిల్లోని అధికారిక బృందాలు పరిష్కరిస్తాయన్నారు. ఈ బృందాలు జిల్లాలోని అందరి ఆవాసాలకు వెళ్లి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ స్థాయిలో అందుతున్నాయో వివరించడమే కాకుండా, నాలుగేళ్లలో రాష్ట్రంలో వచ్చిన మార్పులు, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందించిన ప్రయోజనాలను తెలియజేస్తారని చెప్పారు.జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై 1 నుంచి నెల రోజులపాటు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఈ క్యాంపులలో 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే జారీ చేస్తారు. 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా సమస్యల పరిష్కారానికి నాలుగు వారాల పాటు ఈ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వీటిపై అవగాహన కల్పిస్తారు. కుల, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు ఆదాయ ధ్రువీకరణ, డేట్ ఆఫ్ బర్త్, మరణ ధ్రువీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ), కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్ల తొలగింపు వంటి 11 సర్వీసులు ఈ క్యాంపులలో ఉచితంగా అందజేస్తారు. వినతుల స్వీకరణ, రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్, సర్వీసు రిక్వెస్టులకు వేరువేరు డెస్క్‌లను ఏర్పాటు చేస్తారు. మ్యుటేషన్ ఆఫ్ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి పాస్ పుస్తకాల జారీకి మాత్రం నిర్ణీత చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసినవారికి ముందుగా టోకెన్లు జారీ చేసి, ఆ తరువాత గ్రామంలో జరిగే క్యాంపులో ధృవపత్రాలను అందజేస్తారు. ఈ సేవల గురించి, తమ గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్ గురించి 1902 హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

సర్వీసు చార్జీలు లేకుండా అందించే సేవలు

1) ఆదాయ ధ్రువీకరణ పత్రం
2) డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్
3) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు)
4) మరణ ధ్రువీకరణ పత్రం
5) మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్
6) కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన
7) ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు
8) ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్
9) కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ)
10) వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణ ప్రాంతాల్లో అయితే 90 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు)
11) ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు.

# వెంకయ్యనాయుడు జీవిత విశేషాలతో వెబ్ సైట్, యాప్ ఆవిష్కరణ

## తనదైన శైలిలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టిన ముప్పవరపు వెంకయ్యనాయుడు




విశాఖపట్నం, ప్రజా పాలన ప్రతినిధి 23 జూన్ 2023:భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తనదైన శైలిలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. వారి 75వ జన్మదినోత్సవ సందర్భంలో 50 ఏళ్ళ ప్రజా జీవన ప్రస్థానాన్ని పురస్కరించుకుని, గతంలో వారి దగ్గర వివిధ హోదాల్లో సేవలు అందించిన సహచర బృందంతో ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అటెండర్ నుంచి ఐ. ఏ.ఎస్ అధికారి వరకూ ప్రతి ఒక్కరినీ సత్కరించారు. విశాఖపట్నంలోని ఏ-1 కన్వెన్షన్ హాల్ లో జరిగిన ఈ సమావేశానికి గతంలో వారి దగ్గర పని చేసిన వ్యక్తిగత సహాయకులు మొదలుకుని, ప్రభుత్వ ఉన్నతాధికారుల వరకూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు మాట్లాడుతూ 50 ఏళ్ళ నుంచి తమ సతీమణి ఉషమ్మ సహకారంతో పాటు వివిధ హోదాల్లో తనతో కలిసిన పనిచేసిన సిబ్బంది సహకారం, అంకితభావమే తన విజయాలకు కారణమని ఆయన పేర్కొనటం విశేషం. సమయపాలన, క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, సేవాభావం, అంకితభావం, పరిపూర్ణ దృష్టి, నీతి, రీతి లాంటి ఎనిమిది గుణాలు జీవితంలో ఉన్నతిని అందిస్తాయని పేర్కొన్నారు. జీవితం మనల్ని ఏ మార్గంలో ముందుకు తీసుకుపోయినా సేవా భావాన్ని మాత్రం మరువకూడదని సూచించారు. ఈ సందర్భంగా వారందరికీ భారతీయ సంప్రదాయం ప్రకారం దుస్తులు పెట్టి, ఆశీర్వచనం అందించారు. అనంతరం తెలుగువారి సంప్రదాయ వంటకాలతో వారికి ప్రత్యేక విందును ఏర్పాటు చేసి, అందరినీ పేరుపేరునా, ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారి మనుముడు, మనుమరాళ్ళు కలిసి వెంకయ్యనాయుడు జీవిత విశేషాలతో రూపకల్పన చేసిన యాప్, మరియు వెబ్ సైట్ ను ఆవిష్కరించి, పరిచయం చేశారు. జీవితంలో 75 ఏళ్ళు పూర్తిచేసుకున్న అమృతోత్సవ సందర్భంలో గుర్తు పెట్టుకుని మరీ వెంకయ్యనాయుడు గారు వ్యక్తిగత సిబ్బంది మొదలుకుని, ఉన్నత అధికారుల వరకూ అందరినీ పిలిచి, కుటుంబ సభ్యుల్లా ఆదరించి అభినందించటం పట్ల వారి వద్ద గతంలో పని చేసిన సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. వారి ప్రేరణతో సేవా భావాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఐ.ఏ.ఎస్ అధికారులు ఐ.విసుబ్బారావు, రజత్ భార్గవ్, కృష్ణ కిశోర్, సురేష్, యువరాజ్, ప్రశాంత్ కుమార్ రెడ్డి, రాజ్యసభలో సేవలు అందించిన రామాచార్యులు, ఏ.ఏ.రావు సహా పలువురు ప్రభుత్వ అధికారులు, వెంకయ్యనాయుడు పూర్వ వ్యక్తిగత సిబ్బంది, ప్రస్తుత వ్యక్తిగత సిబ్బంది, వెంకయ్యనాయుడు గారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల జోరు..

(మొదటి పేజీ తరువాయి)

దీనికి నిదర్శనంగా గుంటూరు ఆర్టీసీ బస్టాండులో గత వారం కర్ణాటక బస్సు నుంచి దించిన పార్శిల్స్‌లో 280 పత్తి విత్తన సంచులు (ఒక్కొక్క సంచిలో 450 గ్రాములు) అనుమతి లేకుండా రవాణా అయినట్లు-నిఘా, వ్యవసాయాధికారుల బృందం గుర్తించింది. కర్ణాటకలోని రాయచూరు నుంచి ఆర్టీసీ బస్సులో గుంటూరు బస్టాండుకు వచ్చాయి. అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన రాంబాబు పేరుతో పార్శిల్ రావడంతో కేసు నమోదు చేశారు. మన రాష్ట్రంలో అనుమతి లేని కంపెనీ విత్తనాలు కర్ణాటక నుంచి అక్రమంగా తెప్పించినట్లు-గుర్తించారు. దీంతో పాటు- అయిదుగురు రైతులు కొనుగోలు చేసినట్లు-చూపిన చిరునామా, చరవాణి నంబర్లు నకిలీవిగా గుర్తించారు. ఇతను గతంలో కూడా అక్రమంగా పత్తి విత్తనాలు తరలిస్తూ పట్టు-బడినట్లు-గుర్తించారు.అలాగే పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన గడ్డం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగే వేణు, అన్నమయ్య తదితరులతో కలిసి కర్ణాటక నుంచి మహారాష్ట్రకు అనుమతి లేని పత్తి విత్తనాలు సరఫరా చేస్తూ తెలంగాణ రాష్ట్రం నార్కట్‌పల్లి వద్ద వాహనాల తనిఖీల్లో పత్తి విత్తనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి సేకరించిన విత్తనాలను పల్నాడు జిల్లా దాచేపల్లి తరలించి ఇక్కడ ప్యాకింగ్ చేసి మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతానికి తరలించి అక్కడి రైతులకు విక్రయిస్తున్నారు. వీరి నుంచి రూ. 1. 8కోట్ల విలువైన 10 టన్నుల విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు.

**నిఘా నిల్**

గతంలో నకిలీ విత్తనాల వ్యాపారం చేసేవారిని గుర్తించి విత్తన సీజన్‌లో వ్యవసాయ శాఖ నిఘా పెట్టేది. ఇటీ-వల కాలంలో వారిపై నిఘా తగ్గడంతో ఈ ఏడాది మళ్లీ ప్రారంభించారు. విత్తన సేకరణ నుంచి ప్యాకింగ్ చేసి రవాణా, విక్రయాల వరకు అనుభవం ఉండడంతో అందరూ కలిసి పెద్దఎత్తున రవాణా ప్రారంభించారు. ఈ క్రమంలోనే తెలంగాణ పోలీసులకు పట్టు-బడితే కర్ణాటక నుంచి తెచ్చి పల్నాడు జిల్లా దాచేపల్లిలో ప్యాకింగ్ చేసినట్లు- తేలింది. దాచేపల్లిలోనూ గతంలో పెద్దఎత్తునఅనుమతిలేనిపత్తి విత్తనాలు పట్టు-బడిన సందర్భాలు ఉన్నాయి.

## ప్రజలకు మంచి చేయడం కోసమే..

# జగనన్న సురక్ష

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమం ఈ జగనన్న సురక్ష అన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఉత్సాహవంతులతో కూడిన టీమ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటినీ సందర్శిస్తుందన్నారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరిస్తారు. వారికేమైనా కుల, ఆదాయ, జనన మొదలైన సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి అవసరమైన పత్రాలను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి పూర్తిచేస్తారన్నారు. ఇలా తీసుకున్న దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారన్నారు. ఈ క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే తెలియజేస్తారన్నారు. ఆ రోజు దగ్గరుండి క్యాంపు వద్దకు తీసుకెళ్తారన్నారు. సమస్య పరిష్కారమయ్యేలా వారికి తోడుగా ఉంటారన్నారు. మండల స్థాయి అధికారులైన తహశీల్దార్, ఈఓపీఆర్డీ ఒక టీమ్ కాగా.. ఎంపీడీఓ, డిప్యూటీ తహశీల్దార్ రెండో టీమ్‌గా ఏర్పడి సచివాలయంలో ఒకరోజు పూర్తిగా గడిపేలా చూస్తారన్నారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీతో పాటు మరే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందిస్తుందన్నారు.

## 2024 ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశీర్వదించి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి



తిరుపతి జిల్లా, పాకాల మండలం, ప్రజాపాలన న్యూస్: వైఎస్ఆర్సీపీ చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర పాకాల మండలం పెద్దబయనపల్లి పంచాయతీలో 11వ రోజు శుక్రవారం మోహిత్ రెడ్డి చేపట్టిన కార్యక్రమానికి విశేష ఆదరణ కనబరుస్తున్న శంఖంపల్లి, దాసర్లపల్లి ప్రజలు. శంఖంపల్లి హరిజనవాడలో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మోహిత్ రెడ్డి, గజ మాలలతో ఘనంగా సత్కరించి హారతులు పట్టి ఆహ్వానించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటా హారతులు పట్టి స్వాగతిస్తూ అభిమానాన్ని చాటుకున్న మహిళలు, గడప గడపలో అర్హులకు అందిన ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సీఎం జగనన్నను తిరిగి గెలిపించుకుందామని విజ్ఞప్తి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. నియోజకవర్గంలోనే పాకాల మండలం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, పెద్దబయనపల్లి పంచాయతీలో ప్రజలకు ఏ అవసరమొచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, నిస్సహాయ స్థితిలో ఉన్న అభాగ్యులకు ఆర్థిక సాయం చేసిన మోహిత్ రెడ్డి, శంఖంపల్లి హరిజన వాడలో రేషన్ వాహనం రావడం లేదని సమస్యను మోహిత్ రెడ్డికి తెలియజేసిన మహిళలు, ఆ వాహనదారు స్థానంలో వేరొకరిని నియమించి ప్రజలకు సకాలంలో రేషన్ అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనచేసారు. 2024 ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశీర్వదించి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి.

## ముద్రగడ నీ లేఖలు కాపులను ఏమి చెయ్యలేవు: పసుపులేటి



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: ద్వారంపూడిని సమర్ధిస్తూ.. పవన్ ను విమర్శిస్తూ ముద్రగడ లేఖ రాయడం మంచి పద్ధతి కాదనీ రాజుపాలెం జనసేన పార్టీ నాయకులు పసుపులేటి వెంకట స్వామి పేర్కొన్నారు.వైసీపీకి కాపు జాతిని తాకట్టు పెట్టవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు.ముద్రగడ పద్మనాభం లేఖ కాపులంతా తలదించుకునేలా ఉందన్నారు.ఆయన స్థాయిని ఆయనే ఈ లేఖతో దిగజార్చుకున్నారని తెలిపారు. జనసేనాధిపతిగా ఉన్న పవన్ కళ్యాణ్ను సినీ హీరోగా ప్రస్తావించడం వెనుక కుట్ర అర్థం అవుతుందని అన్నారు.కాడి పారేసి ఇంట్లో కూర్చున్న ముద్రగడ ఇప్పుడు లేఖ రాయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.కాపు ఉద్యమంలో నష్టపోయిన వారిని పరామర్శించారా అంటూ నిలదీశారు.

## జవహర్ నవోదయ కు సెలెక్ట్ అయిన మహీధర్, బాలాజీ నాయక్



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: రాజుపాలెం మేజర్ న్యూస్: మండల హెడ్ క్వార్టర్ లోని నవోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మాదాసు మహీధర్,( నాగవరం), ఆడావత్ బాలాజీ నాయక్( మాచాయపాలెం) గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన జవహర్ నవోదయ కి ఎగ్జామ్స్ రాయిగా, గురువారం రిజల్ట్స్ రావడంతో రాజుపాలెం నవోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులైన వీరి ఇరువురు సెలెక్ట్ అయినట్టు తెలియడంతో స్కూలు టీచర్స్ ఆనందం వ్యక్తం చేశారు, అదేవిధంగా విద్యార్థి తల్లిదండ్రులు రాజుపాలెం నవోదయ స్కూల్ ప్రిన్సిపల్ పత్తి రామారావు కు అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పత్తి రామారావు మాట్లాడుతూ మా స్కూల్ విద్యార్థులు జవహర్ నవోదయ కి సెలెక్ట్ కావడం ఎంతో సంతోషంగా ఉందని, మా స్కూల్ నుండి ప్రతి ఏటా ఇద్దరూ, ముగ్గురు విద్యార్థులు సెలెక్ట్ అవుతూనే ఉన్నారని, ఇందుకు కారణం మా టీచర్స్ హార్డ్ వర్క్, విద్యార్థులు చదువుకోవాలనే పట్టుదల వలన ఈ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు, ముందుగా స్కూల్ ప్రిన్సిపల్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు



## ఎలోన్ మస్క్‌ను ఆహ్వానించిన కర్ణాటక ప్రభుత్వం..

అమెరికా దేశానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఎలోన్ మస్క్‌కు కర్ణాటక ప్రభుత్వం ఆహ్వానం పంపించింది. రాష్ట్రంలో వ్యాపారాలను స్థాపించాలని మస్క్‌ను కోరింది. పెట్టుబడులకు కర్ణాటక "ఆదర్శ గమ్యస్థానం" అని వాణిజ్యం, పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ట్వీట్ చేశారు. అమెరికా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ టెస్లా, ట్విట్టర్ చీఫ్ ఎలోన్ మస్క్‌తో సమావేశమై పెట్టుబడుల కోసం భారతదేశంలో ఉన్న అవకాశాలను అన్వేషించమని ఆహ్వానించారు.ఈ నేపథ్యంలో కర్ణాటక సర్కారు ట్వీట్ చేయడం విశేషం. ఆవిష్కరణలు మరియు సాంకేతికతతో అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా కర్ణాటక రాష్ట్రం ఉందని, టెస్లా, స్టార్‌లింక్‌తో సహా ఎలోన్ మస్క్ యొక్క ఇతర వెంచర్‌లకు అవసరమైన సౌకర్యాలను అందించడానికి సిద్ధంగా ఉందని మంత్రి పాటిల్ తెలిపారు. రాబోయే దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు సాంకేతికత మరియు తయారీ 5.0పై కర్ణాటక సర్కారు దృష్టి సారించిందని పాటిల్ చెప్పారు.

## జగన్ సురక్ష ప్రారంభోత్సవ వీడియో కాన్ఫరెన్స్ లో చీరాల ఎమ్మెల్యే, వైసిపి ఇంచార్జి లు



చీరాల, జూన్ 23, ప్రజాపాలన : బాపట్ల జిల్లా తరుపున, బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుండి ఏర్పాటు చేసిన, జగనన్న సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమం, జగన్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో, చీరాల శాసన సభ్యులు కర ణం బల రామ కృష్ణ మూర్తి, చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కరణం వెంకటేష్ లు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపట్ల జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాషా, జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



చీరాల, జూన్ 23, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ అభివృద్ధి కి సహకారం అందించాలని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, వైఎస్ఆర్సిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ లు, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా ని కోరా రు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యా లయంలో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యకలాపా లపై, బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా ని, చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణ మూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కరణం వెంకటేష్ లు, మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. నియోజక వర్గ అభివృద్ధి పనులపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. అభివృద్ధి పనులకు సహకారం అందించాలని, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషాకు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్, పెద్దవారు విజ్ఞప్తి చేయాల్సిన అవసరం లేదు, బాధ్యతాయుతంగా నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడపటం అభినందనీయమని, నియోజకవర్గ మరింత మెరుగైన అభివృద్ధికి, తన వంతు సంపూర్ణ సహకారాన్ని అంద జే స్తానని స్పష్టంగా హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంటనే సానుకూలంగా స్పందించడం పట్ల, కలెక్టర్‌కు ఎమ్మెల్యే బలరామ్, వైసిపి ఇన్చార్జి వెంకటేష్ లు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: చీఫ్ విప్ ముదునూరి



నరసాపురం, జూన్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి నియోజవర్గంలో 47 కోట్ల రూపాయల నిధులతో పీ. హెచ్.సిలు, సి. హెచ్.సి లు, సబ్ సెంటర్లను అభివృద్ధి చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించి, భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి నూతన భవనాన్ని నిర్మించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని అన్నారు. ఆసుపత్రిలోని రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా డాక్టర్లు, అధికారులు, సిబ్బంది, యంత్రాంగాన్ని కూడా నియమించామని మరికొన్ని విభాగాలలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. మరమ్మత్తు పనులను పూర్తిచేసుకుని ఈ రోజు పాతభవనం నుండి నూతన భవనంలోకి వైద్య ఆరోగ్య సేవలు మార్చడం జరుగుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మార్పు అనంతరం పాత భవనం ఆధునికరణ పనులు ప్రారంభిస్తామని నిధులు మంజూరు చేశామని ఆయన తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందని ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఉందన్నారు. విలేజ్ క్లినిక్ కేంద్రాల ఏర్పాటు, ఫ్యామిలీ ఫిజీషియన్, 108, 104 అంబులెన్సుల సౌకర్యం, తల్లిబిడ్డల మొబైల్ వాహన సౌకర్యాలు వంటి తదితర వసతులు ప్రభుత్వం కల్పించిందని ప్రజలు వైద్య ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మొగల్తూరు మండలంలో ఇంతవరకు ఒకటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేదని ఇప్పుడు రెండున్నర కోట్ల రూపాయలతో కాళీపట్నం గ్రామంలో నూతనంగా మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నామని ఆయన అన్నారు. పట్టణ పరిధిలో గతంలో రెండు సబ్ సెంటర్ల నుండి ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేవని, నూతనంగా మరో సబ్ సెంటర్ ను నిర్మించుకొని మొత్తం మూడు సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నామని ఆయన ఆయన తెలిపారు. నియోజవర్గంలో సుమారు 47 కోట్ల రూపాయలతో నాడు నేడు కార్యక్రమం ద్వారా పీ. హెచ్.సి లు, సి. హెచ్. సి లు, సబ్ సెంటర్లు ఆధునికరణ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచామని డిహైడ్రేషన్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్, రెడ్ క్రాస్ సంస్థ ద్వారా బ్లడ్ స్టోరేజ్ పాయింటును కూడా ఏర్పాటు చేసామని డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, హాస్పిటల్ డైరెక్టర్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఏఎంసి చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జడ్పిటిసి తిరుమని బాపూజీ, హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ త్రిమూర్తులు, పలువురు పార్టీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులలో విద్యా స్ఫూర్తికి కంకణం

### పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు



వేటపాలెం, జూన్ 23, ప్రజాపాలన : విద్యార్థులలో విద్యా స్ఫూర్తికి కంకణం కట్టుకుని, విద్యార్థులలో స్ఫూర్తి ని నింపి, చదువుకోవాలని ఇష్టం పెంచేందుకు విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశామని, పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు స్పష్టం చేశారు. పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో, వేట పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 225 మంది విద్యార్థులతో పాటు, మండలం లోని పలు హైస్కూళ్ల లో చదువుతున్న విద్యార్థులు, జాండ్రపేట బీవీ అండ్ బి ఎన్ పాఠశాలలో చదు వుతున్న విద్యార్థులతో కలిపి, మొత్తం 550 మంది విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, సెకండరీ స్కూల్ చదువుకు తొలి మెట్టు అయిన 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లితండ్రు లు, గురువులు మధ్య అను సంధానం ఉండేలా చేసే నిమిత్తం, వారి మధ్య వారధిగా వుండేందుకు, హోమ్ టాస్క్ బుక్( డైరీ) ప్రతీ ఒక్కరికీ పంపిణీ చేశామన్నారు. తల్లితండ్రులు పిల్లవాని చదువు, హోం వర్క్, హాజరు, మార్క్స్ గురించి ఎప్పటికప్పుడు, ఏ రోజుకా రోజు తెలుసు కొనుటకు, అదే విధంగా ఇంటి వద్ద తమ పిల్లల వర్క్, నడవడిక, చదువుల పై అవగాహన కలిగి ఉండేందుకు, గురువులకు తెలిపేందుకు ఇది ఒక వారధిగా వుండేందుకు, విద్యార్థులలో చదువుపై శ్రద్ధ పెట్టాలని ప్రేరణ పొందేందుకు, ఉ పయోగపడుతుందనే ఉద్దే శంతో, స్కూల్ డైరీల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, వేట పా లెం మండల పరిధిలోని స్కూ ల్స్, జాండ్ర పేట ప్రాంతంలో, వెనకబడిన వర్గాల విద్యార్థులు అధికంగా ఉన్న ప్రాంతంలో, విద్యార్థులలో ప్రేరణ, స్ఫూర్తిని కల్పించేందుకు, స్కూల్ డైరీలు పంపిణీ చేయటం ఆనందంగా ఉ ందన్నారు. స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి నిమిత్తం రు. 10వేలు సంఘం ఆధ్వర్యంలో, అందజేస్తానని హామీ ఇచ్చారు. హాజరైన ఆయా హైస్కూళ్ల ఉపాధ్యాయులకి కూడా, వారి వారి విద్యార్థుల నిమిత్తము డైరీలు అందచేసి, వాటిని అమలు చేయడం ద్వారా, విద్యార్థులలో విద్యాస్ఫూర్తిని కలగ చేయాలని నాగరాజ్ అన్నారు. కార్యక్రమం లో సంఘం సభ్యులు నున్నా శివప్రసాదరావు, సహాయ కార్యదర్శి చుండూరు నాగంజనేయులు, గుడువెూటి శేఖర్, జీవీఆర్ నాగరాజ్, ప్రత్తి శరత్ బాబు, గొడవర్తి రామకృష్ణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు జానమ్మ, సరళ, శ్రావణి, వ్యాసశ్రీ, శాస్త్రి, బ్రహ్మా రెడ్డి, బండ్ల బాపయ్య హిందూ హైస్కూల్ ఉపాధ్యాయులు సుబ్బారావు, ఏసుబాబు, పందిళ్ల పల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు మోహన్ రావు, జాండ్రపేట ఉపాధ్యాయులు ప్రసాదరావు, ఆంజనేయులు, దేశాయిపేట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమం



ఏర్పేడు మండల కేంద్రమైన, ఏర్పేడు సచివాలయంలో" జగనన్న సురక్ష కార్యక్రమం"ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగనన్న సంక్షేమ పథకాలు కు అర్హులుగా మిగిలి ఉండి, పూర్తిగా సంక్షేమ పథకాలు అందజేయాలని ఉద్దేశంతో, మరియు87% వరకు ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగింది. ఇంకా మిగిలిన వారు ఎవరైనా అర్హులైన వారు ఉంటేవారికి సంక్షేమ పథకాలన్నీ పూర్తిగా అందజేయాలని ఉద్దేశంతో ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని. ఎంపీడీవో గిడ్డయ్య తెలియజేశారు. ఏర్పేడు సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య, జడ్పిటిసి తిరుమలయ్య, ఎంపిపి గీత, పంచాయతీ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ల సర్వసభ్య సమావేశం నూతన కార్యవర్గ ఏకగ్రీవం





బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 23: స్థానిక విస్తరణ శిక్షణా కేంద్ర ము బాపట్ల ఎల్ఐసి ఏజెంట్ ల సర్వసభ్య సమావేశము,శుక్రవారం నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బి. మార్కండేయులు జోనల్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ యూనియన్ లో ఏజెంట్లు అందరూ కలిసి ఉండాలని, ఆఫీసులో సమస్యల పరిష్కారానికి ఒక తాటిపై నడవాలని, డివిజన్లో ఏ పనైనా మీరందరూ కలిసి ఉంటే తక్షణమే జరుగుతుందని, ఏజెంట్లకు అనేక విషయాలు తెలియజేశారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.నూతన కార్యవర్గం సభ్యులు: చేగూడి అంకయ్య అధ్యక్షులు, బోడపాటి చంద్రశేఖర రావు కార్యదర్శి, య క్కల దత్తాత్రేయులు కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గూ డపాటి జాన్ వెస్లిలి, వైస్ ప్రెసిడెంట్సా గాంధీ,రమేష్ కుమార్, పరిశ రామ్, శంకర్రావుజాయింట్ సెక్రటరీస్ రవీంద్ర, ఉస్మాన్, వెంకటేశ్వరరావు, పద్మనాభం, కొండలు ఈ కార్యక్రమంలో డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ సమేట రాంబాబు, ఆరిగ రవీందర్ రెడ్డి డివిజన్ జనరల్ సెక్రెటరీ, కళం శ్రీనివాసరెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ , ఎల్ఐసి ఏజెంట్లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు .




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 24, జూన్ 2023

# ఆ హామీలు నీటిపై రాతలేనా ?

ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరినీ రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవంగా క్యాబినెట్ నిర్ణయం ప్రకారం రెగ్యులర్ కావడానికి అవకాశమున్న ఉద్యోగులు 6,665 మంది మాత్రమే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఇంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పలేదు. అందరినీ రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం ప్రకటన చేయడం 3 లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగు ఉద్యోగులను మోసగించడమే.రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా, మానిఫెస్టోలో, ప్రజా సంకల్ప యాత్రలో హామీలిచ్చింది. కాని ఈ హామీలను నేటికీ అమలు చెయ్యలేదు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యుత్, ఆర్‌టిసి, టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపల్, పంచాయితీ వంటి స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, వెలుగు తదితర ప్రభుత్వ పథకాలు, యూనివర్శిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థలలో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వీరే కాక పై శాఖలు, సంస్థలలో 3 దశాబ్దాల నుండి ఎన్‌ఎంఆర్, డైలీ వేజ్, కంటింజెంట్, టైమ్ స్కేల్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఏ నాటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరినీ రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవంగా క్యాబినెట్ నిర్ణయం ప్రకారం రెగ్యులర్ కావడానికి అవకాశమున్న ఉద్యోగులు 6,665 మంది మాత్రమే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఇంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పలేదు. అందరినీ రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం ప్రకటన చేయడం 3 లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగు ఉద్యోగులను మోసగించడమే. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి గురిచేస్తున్నది. ఇచ్చిన హామీల ప్రకారం అందర్నీ రెగ్యులరైజ్ చేయాలి. 'మాట తప్పను - మడమ తిప్పను' అనే మాటలను అందర్నీ రెగ్యులరైజ్ చేయడం ద్వారానే సి.ఎం జగన్‌మోహన్ రెడ్డి రుజువు చేసుకోవాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో తక్కువ వేతనాలతో జీవో 5, 7 లను విడుదల చేసింది. గత పిఆర్‌సి లోని కనీస వేతనం రూ.20 వేలు కాగా కేవలం రూ.15 వేలతో జీవో 7 విడుదల చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను దగా చేసింది. నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, ఉపాధి హామీ, వెలుగు, 102, 104, 108, ఏపి సాక్స్, ఎన్‌టిఇపి, మెప్మా, ఐసిడిఎస్ వంటి ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు అమలు చేయాల్సిన మినిమమ్ టైమ్ స్కేలు నేటికీ అమలు చెయ్యలేదు. ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, కరెంటు చార్జీలు, రవాణా చార్జీలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థితి ఉన్నది. వీటి పరిష్కారానికై అందరూ కలిసి ప్రభుత్వంపై ఐక్యంగా ఒత్తిడి తేవాలి. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్.యం.ఆర్ డైలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరిట రాష్ట్ర ప్రభుత్వ పథకాలేవీ వర్తింపచేయడం లేదు. వీరికి ప్రభుత్వ పథకాలను అమలు చేయడం కష్ట సాధ్యమేనంటూ ముఖ్యమంత్రి సెలవివ్వడం అన్యాయం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాదే అయ్యిందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్రం నాటి నుండి విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సేవలందిస్తున్నారన్న వాస్తవాన్ని మంత్రిర్యులు తెలుసుకోవడం మంచిది. తెలంగాణలో ఎవ్వరూ రెగ్యులర్ కాలేదంటున్న మంత్రి వ్యాఖ్యలు వాస్తవం కాదు. తెలంగాణలో 2014 జూన్ 2 నాటికి పనిచేస్తున్న వారిని (5,544 మందిని) రెగ్యులర్ చేశారు. వీరితో పాటు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆర్టిజన్స్‌గా రెగ్యులర్ చేశారు. ఈ విధంగా మంత్రివర్యులే మాట్లాడటం ఆయన స్థాయికి తగినది కాదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం వారి వాస్తవ సమస్యలను అర్థం చేసుకోలేదు. ఇప్పటికైనా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సమస్యలపై వారి జెఎసి నాయకత్వంతోనే చర్చలు జరిపే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలి. సమస్యల పరిష్కారానికై ఇప్పటికే వారి జెఎసి పోరుబాట పట్టింది. ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కింది సమస్యలు పరిష్కరించాలి. 1. డిసెంబర్ 31, 2022 నాటికి పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. 2. ఉద్యోగికి 3-5 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలి. 3. టెమ్ స్కేల్, డైలీ వేజ్, కంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. 4. పార్ట్ టైమ్, గెస్ట్ వ్యవస్థను ఫుల్ టైమ్‌గా మార్చాలి. 5. అందరికీ సమాన పనికి సమాన వేతనం, సౌకర్యాలు అమలు చేయాలి. ఒకే క్యాడర్-ఒకే వేతనాన్ని అమలు చెయ్యాలి. 6. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. 7. పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. 8. రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలి. 9. సాధారణ సెలవలు, అనారోగ్య సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలి. 10. ఇపిఎఫ్, ఇఎస్ఐ లను కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైమ్, వివిధ స్కీమ్‌లలో అమలు చెయ్యాలి. ఈ సమస్యల పరిష్కారానికై పెద్ద ఎత్తున కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర క్యాటగిరి ఉద్యోగులు ఐక్య ఆందోళనలు నిర్వహించాలని జెఎసి నిర్ణయించింది.

# 'పాట్నా' నుంచి దేశం ఏం ఆశిస్తోంది ?




కేంద్రంలో బిజెపి ని ఓడించడమే అంతిమ లక్ష్యంగా వుండాలి. అందుకు...రాష్ట్ర ప్రాతిపదికన వీలైనంత వరకు బిజెపి వ్యతిరేక ఓట్లను ఏకం చేయడంపై దృష్టి పెట్టాలి. బీహార్, తమిళనాడులో మాదిరిగా బిజెపి వ్యతిరేక ఓట్లను పోగు చేసేందుకు కృషి చేయాలి. క్లుప్తంగా చెప్పాలంటే, స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానంతో జాతీయ సమస్యలపై ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకుంటూ గరిష్టంగా బిజెపి వ్యతిరేక ఓట్లను సంపాదించడం, రాష్ట్రాలలో బిజెపికి వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువ సంఘటిత ఆందోళన, పోరాటాన్ని నిర్మించడం ప్రతిపక్ష వ్యూహంగా వుండాలి. అందుకు తోడ్పడే చర్చలు, నిర్ణయాలు పాట్నా సమావేశం నుండి వస్తాయని ఆశించవచ్చు. జూన్ 23న బీహార్ రాజధాని పాట్నాలో విపక్షాల సమావేశం జరగనుంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటికి భిన్నంగా ఇప్పుడు విపక్షాలలో సామరస్యం, ఐక్యత కనిపిస్తోంది. మోడీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన, దాని ప్రజా వ్యతిరేక విధానాలే ప్రతిపక్షాలలో ఇంతటి సామరస్యాన్ని సృష్టించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం మోడీ ప్రభుత్వం మతం పేరున ప్రజల మధ్య చిచ్చుపెట్టి వారిలో అభద్రతాభావం, గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలలో మతపరమైన అల్లర్లు పునరావృతం అవుతుండగా మణిపూర్‌లో రెండు నెలలగా కొనసాగుతున్న మతపరమైన హింస దీనినే రుజువు చేస్తున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఐదేళ్లు పూర్తయింది. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అరికట్టామని చెబుతున్నా అక్కడ ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. బిజెపి పాలన ఇలాగే కొనసాగిన పక్షంలో దేశం ముక్కచెక్కలు అవుతుందన్న భయం బలంగా ఉంది. ఈ స్థితిలోనే ప్రతిపక్ష పార్టీల సమావేశం పాట్నాలో జరుగుతున్నది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్నారు. సిపిఎం, సిపిఐ ప్రధాన కార్యదర్శులు, కాంగ్రెస్ అధ్యక్షుడు, నలుగురు ముఖ్యమంత్రులు, శరద్ పవార్ వంటి విపక్షాల సీనియర్ నేతలందరూ ఈ సమావేశానికి హాజరుకానున్నారు. బిజెపి కి వ్యతిరేకంగా బలమైన లౌకిక ప్రజాస్వామ్య కూటమి ఉన్న రాష్ట్రం బీహార్. ఆర్‌జెడి నేతృత్వంలోని మహాకూటమి ఇక్కడ అధికారంలో ఉంది. లాలూ ప్రసాద్ ఆర్‌జెడి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) చేతులు కలపడంతో రాష్ట్రంలో బిజెపి అధికారాన్ని కోల్పోయింది. ఈ కూటమితో సిపిఎం, సిపిఐ అవగాహన కుదుర్చుకున్నాయి. బీహార్‌పై ఎప్పుడూ సామ్యవాద, వామపక్ష రాజకీయాల ప్రభావం వుండనే వుంటుంది. 1990 అక్టోబర్‌లో అద్వానీ రథ యాత్రను బీహార్ లోని సమస్తిపూర్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ అడ్డుకున్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన ఉద్యమానికి బీహారే వేదికైంది. అందువల్ల మోడీ నేతృత్వంలోని హిందుత్వ శక్తులను ఎదుర్కొనేందుకుగాను ప్రతిపక్షాలు రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించడానికి పాట్నా సరైన వేదిక అనడంలో ఎలాంటి సందేహం లేదు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు తమ రాజకీయ ఎత్తుగడలకు పాట్నాలో శ్రీకారం చుట్టనున్నాయి. విపక్షాల ఐక్యతకు సంబంధించి మూడు ప్రధాన అవగాహనలు ఉన్నాయి. అన్ని విపక్షాలను ఒకే వేదిక పైకి చేర్చి జాతీయ ప్రతిపక్ష కూటమిగా ఎదగవచ్చన్నది చాలా తేలికైన ఆలోచన. మరో ఆలోచన ఏదైనా ఒక రాజకీయ పార్టీ అధినేత నేతృత్వంలో ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేయడం. మూడో ఆలోచన జాతీయమైనా, ప్రాంతీయమైనా ప్రతి రాష్ట్రంలో ప్రధానమైన బిజెపి వ్యతిరేక పార్టీ నాయకత్వంలో ఐక్యత. ఇవన్నీ భారతీయ వాస్తవికతకు దూరంగా ఉన్న భావనలని చెప్పవచ్చు. విపక్షాలన్నింటినీ కలుపుకొని జాతీయ స్థాయిలో కూటమి లేదా ఫ్రంట్ ఏర్పాటు చేయడం కష్టం. అటువంటి కూటమి లేదా ఫ్రంట్ ఏర్పాటు ద్వారానే జాతీయ స్థాయిలో బిజెపిని ఓడించగలమన్న భావనకు భారత రాజకీయ వాస్తవికతకు లంకె కుదరదు. ఎన్నికల తర్వాత నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ ఏర్పడి ప్రధానమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసుకున్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమం కూడా ఎన్నికల తర్వాత రూపొందించబడుతుంది. కాబట్టి ఎన్నికలకు ముందే నాయకుడిని, ఫ్రంట్‌ను ఎంచుకోవాలనే వాదన భారత రాజకీయ వాస్తవికతకు సరిపోదు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాజకీయ అంశాలపై ప్రతిపక్షాల ఐక్యత ముఖ్యం. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ, ఫెడరలిజంపై మోడీ ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి దాడి చేస్తున్నాయి. ఇటువంటి కీలకమైన అంశాలపై ప్రతిపక్షం ఐక్యంగా నడుస్తుందా అన్నది ప్రశ్న. అదానీ వ్యవహారంపై జెపిసి విచారణ జరిపించాలని 18 రాజకీయ పార్టీలు రాసిన లేఖ అది సాధ్యమేనని రుజువు చేసింది. దీంతో పాటు ఇ.డి, సిబిఐ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను వేధించడానికి వ్యతిరేకంగా మెజారిటీ ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసినప్పుడూ ప్రతిపక్షాలు ఐక్యంగా నిరసన తెలిపాయి. ఆ తర్వాత తమిళనాడు మంత్రి వి.సెంథిల్ బాలాజీని ఇ.డి అరెస్టు చేసింది. ఢిల్లీ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులకు జైలుశిక్ష పడింది. అయితే, మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న భారీ రేషన్ కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ఏ కేంద్ర ఏజెన్సీ కూడా సిద్ధంగా లేదు. అదానీ విషయంలోనూ అలాగే ఉంది. నియామకాలు, బదిలీల విషయంలో ఢిల్లీ లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికే తుది అధికారం ఉంటుందన్న సుప్రీంకోర్టు తీర్పును అతిక్రమిస్తూ కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఢిల్లీ పోలీసులు చట్టపరమైన తమ విధులను విస్మరించి మహిళా రెజ్లర్లను వేధించిన బిజెపి ఎం.పి, భారత రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వత్తాసు పలుకుతున్నారు. సత్యపాల్ మాలిక్ వెల్లడించిన సంచలనాత్మక విషయాలపైగాని అదానీ కుంభకోణంపైగానీ మణిపూర్‌లో మత మారణహోమంపైగానీ ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇటువంటి రాజకీయ సమస్యలకు ప్రత్యామ్నాయాన్ని చూపడంతో పాటు...ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు ముందుకు రావాలి. మరో మాటలో చెప్పాలంటే, ప్రజా సమస్యలపై ఉమ్మడి ప్రచారం, ఆందోళనలను ముమ్మరం చేయాలి. కొన్ని రాష్ట్రాల్లో సంఘటిత ప్రచారానికి, పోరాటానికి అడ్డంకులు ఎదురుకావచ్చు. అలాంటిచోట సంబంధిత పార్టీలు ఈ ప్రచారాన్ని చేపట్టి తమదైన రీతిలో పోరాటం చేయడం మంచిది. అయితే కేంద్రంలో బిజెపి ని ఓడించడమే అంతిమ లక్ష్యంగా వుండాలి. అందుకు...రాష్ట్ర ప్రాతిపదికన వీలైనంత వరకు బిజెపి వ్యతిరేక ఓట్లను ఏకం చేయడంపై దృష్టి పెట్టాలి. బీహార్, తమిళనాడులో మాదిరిగా బిజెపి వ్యతిరేక ఓట్లను పోగు చేసేందుకు కృషి చేయాలి. క్లుప్తంగా చెప్పాలంటే, స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానంతో జాతీయ సమస్యలపై ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకుంటూ గరిష్టంగా బిజెపి వ్యతిరేక ఓట్లను సంపాదించడం, రాష్ట్రాలలో బిజెపికి వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువ సంఘటిత ఆందోళన, పోరాటాన్ని నిర్మించడం ప్రతిపక్ష వ్యూహంగా వుండాలి. అందుకు తోడ్పడే చర్చలు, నిర్ణయాలు పాట్నా సమావేశం నుండి వస్తాయని ఆశించవచ్చు.

# ఫలించనున్న గిరిజనుల కల

గిరిజనుల దశాబ్దాల కల నెరవేరబోతున్నది. వివాదాల్లో ఉన్న పోడు భూముల సమస్య పరిష్కారానికి రంగం సిద్ధమైంది. ఈ నెలలోనే పట్టాలు పంపిణీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటవీ, గిరిజన, రెవెన్యూశాఖల సమన్వయంతో చేసిన కసరత్తు దాదాపుగా పూర్తికావచ్చింది. పోడు భూముల పట్టాల పంపిణీ దస్త్రంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేసిన విషయం తెలిసిందే.పోడు భూములకు పట్టాలిచ్చే విషయమై రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ల్లోని 295 మండలాలు, 2,845 గ్రామ పంచాయతీల పరిధిలో అటవీ హక్కుల కమిటీలు క్షేత్రస్థాయిలో నెలలపాటు కసరత్తు చేశాయి. 12,49, 296 ఎకరాలకు 4,14,353 క్లెయిమ్స్‌ను ఈ ఫారెస్ట్ కమిటీలు వివిధ స్థాయిల్లో పరిశీలించా యి. 4,05,601 ఎకరాలకు సంబంధించి 1,50,012 మంది లబ్ధిదారులు పోడు పట్టాలకు అర్హత కలిగి ఉన్నారని తేల్చారు. ఇప్పటికే పట్టా ల పంపిణీపై గిరిజన, అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల సంతకంతో పాటు, లబ్ధిదారుడి ఫొటో ఉండేలా పట్టాదారు పాస్‌బుక్‌లు సిద్ధమయ్యాయి.భవిష్యత్తులో అటవీ భూమి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా పాలిగాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. పంపిణీ చేసిన తర్వాత భవిష్యత్తులో ఇరుగుపొరుగు వారితో భూ హద్దు వివాదాలు తలెత్తకుండా ఉండటం కోసం ప్రభుత్వం ఈ టెక్నాలజీని వినియోగించినట్టు అధికార యంత్రాంగం తెలిపింది.భూ సర్వే నెంబర్, పంపిణీ చేసే భూమి విస్తీ ర్ణం, ఆ భూమి ఏ అక్షాంశ, రేఖాంశాల మధ్య ఉన్నది? సంబంధిత భూ హద్దులేవి? వంటి అంశాలను గూగుల్ మ్యాపింగ్ వివరాలతో పాటు హోలోగ్రామ్‌ను పోడు పట్టాలలో పొందుపరుస్తున్నారు. పంపిణీ విషయంలో కలెక్టర్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోడు భూములకు కూడా భవిష్యత్తులో రైతుబంధు పథకం వర్తింపజేస్తామని కూడా ముఖ్యమంత్రి తెలిపారు.గిరిజనులు అడవిని కొంతమేర నరికి జొన్న, సజ్జలు వంటి చిరుధాన్యాలూ, ఇతర కూరగాయలు పండిస్తారు. ఇవే వారి ప్రధాన జీవనాధా రం. నాగలిని ఉపయోగించకుండా కేవలం ఒక చిన్న గొడ్డలి సహాయంతో అడవిని కొట్టి సాగుచేసే ఈ పద్ధతిని 'పోడు' అంటారు. అడవుల్లోని కొం డవాలుల్లో చిన్న చిన్న చెట్లను, పొదలను నరికి చేసుకునే ఈ వ్యవసాయాన్నే 'పోడు వ్యవసాయం'గా పిలుస్తారు. ఇలాంటి పోడు భూముల్లో వ్యవసాయం చేసుకొనే కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలో లక్షల్లో ఉన్నాయి. అయితే ఈ భూములపై వారికి ఎలాంటి హక్కులేదు. అవన్నీ ప్రభుత్వభూములే. బ్రిటిష్ ప్రభుత్వం 'ప్రభుత్వ ఏజెం ట్' (కలెక్టర్ల) అధీనంలో పరిపాలన సాగించడం వల్ల ఈ ప్రాంతాలను 'ఏజెన్సీ ప్రాంతాలు' అనేవారు. వీటిపై హక్కులు కల్పించాలని గిరిజనులు చాలా ఏండ్లుగా పోరాటం సాగిస్తున్నారు.రంప పోరాటాల తర్వాత గిరిజన ముఠాదార్లతో ఒప్పందాలు కుదిరాయి. వారికి ముఠా నిర్వహణ ఇస్తూనే ప్రతి విషయంలో ఆంక్షలు విధించడం బ్రిటిష్ హయాంలో జరిగింది. తర్వా త నిజాం ప్రభుత్వం కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. భూ పంపకం చాలా ముఖ్యమైన కార్యక్రమం. కానీ భూ నిర్ధారణ 1988 వరకు చేపట్టలేదు. అటవీ చట్టాల అమలులో మాత్రం ఏ విధమైన మార్పులు చేయలేదు. బ్రిటిష్ పాలనలో అమల్లో ఉన్న 1917 భూమి బదలాయింపు చట్టానికి బదులు 1959లో మరో చట్టం వచ్చింది. దీన్ని 1963 నుంచి తెలంగాణలోనూ వర్తింపజేయడంతో మొత్తం రాష్ట్రమంతా ఒకే చట్టం వచ్చింది. అయితే చట్టంలో లోపాల కంటే అమలులో అలసత్వమే ఎక్కువ. కొన్నిసార్లు గిరిజనులకు నోటీసులు ఇవ్వకుండా, వారి భూమి హక్కు పత్రాలను సరిగా పరిశీలించకపోవడం వల్ల గిరిజనులు భూమిని కోల్పోయారు. అటవీ భూములుగా ప్రకటించే ముందు వాస్తవాలను పట్టించుకోకపోవడం వల్ల ఎన్నో పురాతన గిరిజన గ్రామాలు, తరతరాలుగా వ్యవసాయంలో ఉన్న గిరిజన భూములు అడవుల్లో కలిసిపోయాయి. సంప్రదాయకంగా సామాజిక, వ్యక్తిగత హక్కులు కలిగిన గిరిజన రైతులు అడవిలో 'చొరబాటుదారులు'గా పరిగణించబడ్డారు. దీంతో భూమి రికార్డులు తప్పుల తడకగా అస్తవ్యస్తంగా మారాయిఏండ్ల తరబడి పోడు భూముల రగడ రగులుతున్నది. అటవీ అధికారులకు, ఆదివాసీ బిడ్డలకు మధ్య నిత్యం పోరు నడుస్తున్నది. ఇటీవల ఈ పోడు గొడవల్లోనే ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాసరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తికోయల దాడి లో ఏకంగా ప్రాణాలే కోల్పోయారు. తాము సాగు చేస్తున్న పోడు భూముల్లోకి ఫారెస్ట్ ఆఫీస ర్లు చొరబడుతున్నారని, తమ పంటలను నాశ నం చేస్తున్నారని గిరిజన బిడ్డలు గగ్గోలు పెడుతున్నారు. అటవీశాఖ భూముల్లోని చెట్లను నరుకు తూ, అటవీ సంపదను నాశనం చేస్తూ, భూములను ఆక్రమించుకుంటున్నారని, ఫారెస్ట్ ఆఫీసర్లు అంటున్నారు. ఇలా ఎడతెగని రచ్చ జరుగుతున్న ది. ఇద్దరి వాదన సరైనదే, అసలు పరిష్కారం పోడు భూముల పట్టాల పంపిణీనే. ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్ట డం కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని కార్యాచరణను చేపట్టారు. పోడు భూముల పట్టాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభు త్వం జీవో 140 జారీ చేసింది. భవిష్యత్తులో ప్రతీ గిరిజనుడికి న్యాయం జరిగేలా, అటవీ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. గిరిజనుల వివరాలు నమోదు చేసి పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని ప్రభుత్వం కోరింది. అడవుల నడిమధ్యలో సాగవుతున్న పోడు వ్యవసాయాన్ని తరలించి, అడవి అంచున భూమిని కేటాయించి ఆ భూములకు పట్టాలిచ్చి, వ్యవసాయానికి నీటి వసతి, కరెంటు సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. దీనివల్ల అడవులు నరికివేత కూడా నివారించబడుతుంది.అడవి బిడ్డలకు అడవుల మీద ప్రేమ ఉంటుంది. వారి జీవన సంస్కృతి అడవులతో ముడిపడి ఉంటుంది. వారు అడవులను ప్రాణంగా చూసుకుంటారు.

## గతంలో అసభ్య పదజాలంతో దూషించే వారే... నేడు అభినందనలతో ముంచెత్తారు

**విద్యుత్ శాఖ పై గోకవరం మండల ప్రజలు**



గోకవరం.ప్రజాపాలన జూన్ 23: కరెంట్ పోతే అసభ్య పదజాలంతో దూషించే పరిస్థితి నుంచి ఎక్కడో ఒకచోట విద్యుత్ కి అంతరాయం కలిగిందనుకుంటా పాపం విద్యుత్ అధికార సిబ్బంది ఎంతకష్టపడుతున్నారో... అనుకునే పరిస్థితి కి వచ్చారు గోకవరం మండల ప్రజలు... నిజమే నమ్మలేకపోతున్నాము అనుకుంటే పొరపాటే.... ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక విద్యుత్ శాఖ ఏఈ గా అశోక్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మండల ప్రజలు హాయిగా నిద్రపోవడం తో పాటు పెద్ద చిన్న అనే తేడా లేకుండా అందరూ విద్యుత్ శాఖ అధికారులను సిబ్బందిని అభినందిస్తున్నారు. ఇటీవల మండలంలో గాలి తుపాన్ విద్వంసం సృష్టించిన విషయం తెలిసిందే, అదే సమయంలో 33 కెవి విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి, రాత్రి సమయం కనుక సిబ్బంది తక్కువ గా ఉండడంతో పాటు వాళ్ళ బందువులు అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏఈ అశోక్ మాత్రం సకాలంలో విద్యుత్ ను పునరుద్దరణకు శ్రీకారం చుట్టారు. విధులు పట్ల ఎంతో అంకితభావంతో పనిచేసే ఏఈ అశోక్ తో పాటు వారి సిబ్బంది కి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## విద్యార్థులు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఎదగాలి: ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



దాచేపల్లి ప్రజాపాలన న్యూస్.: దాచేపల్లి మండలం కేసనుపల్లి గ్రామంలో నూతనంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ హై స్కూల్ గా అయినందున ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పున ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ కేశనపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల అయిపోయిన అనంతరం హై స్కూల్ కి వెళ్ళాలంటే కేసనుపల్లి రైల్వే గేట్ దాటి హై స్కూల్ కు వెళ్ళవలసి ఉందని వారి ఇబ్బందులను గమనించి ప్రాథమిక పాఠశాలను జిల్లా ఉన్నత పాఠశాలగా చేసేందుకు కృషి చేయడం జరిగిందని విద్యార్థులు బాగా చదువుకొని ఇదే గ్రామం నుండి ఒక డాక్టర్లుగా ఇంజనీర్లుగా అనేక ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా చదువుకోవాలని కోరారు అనంతరం విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ కోట కృష్ణ, జడ్పిటిసి మూలగొండ్ల కృష్ణకుమారి ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, కేసనుపల్లి సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు మందపాటి రమేష్ రెడ్డి , జాకీర్ హుస్సేన్, కే వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు నెల్లూరు కోటేశ్వరరావు(దర్మకర్త) తదితరులు పాల్గొన్నారు

## జగనన్న సురక్ష పథకంపై అవగాహన



నరసాపురం, జూన్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ప్రారంభించి వాలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లకు జగనన్న సురక్ష పథకం విధివిధానాలపై అవగాహన కల్పించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిపి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కావలసిన పత్రాలను ప్రజల నుంచి సేకరిస్తారని సర్పంచ్ తెలిపారు. మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయానికి వచ్చి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై 11 రకాల సర్టిఫికెట్లను, అనుమతి పత్రాలను జారీ చేస్తారని ఈ కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ నాగ ముత్యమాంబ తెలిపారు. వాలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు అందరూ అవగాహనతో పనిచేయాలని ఆమె అన్నారు. వాలంటీర్లకు విధివిధానాలకు సంబంధించి పత్రాలను సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రఘురాం, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### నా వంతు వైద్య సహాయ సహకారాలు అందిస్తా: నాగరాజు



ఏర్పేడు ప్రజాపాలన న్యూస్: ఏర్పేడు మండలం పాపా నాయుడుపేట ప్రాథమిక హెల్త్ సెంటర్ నందు వైద్యుడు పి. హర్షవర్ధన్ బదిలీ కావడంతో అతని స్థానంలో నాగలాపురం మెడికల్ ఆఫీసర్ గా పనిచేసిన పి. నాగరాజు ను పాపా నాయుడుపేట హాస్పిటలకు బదిలీ పై రావడం జరిగింది. డాక్టర్ పి. నాగరాజు మాట్లాడుతూ పాపా నాయుడు పేట ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు నా వంతు ఎల్లవేళలా వైద్య సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.

# భారతీయుల ఐక్యత కోసం పాటుపడిన మహా వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ

## బిజెపి నరసరావుపేట అసెంబ్లీ కన్వీనర్ రామకృష్ణ



పల్నాడు జిల్లా నరసరావుపేట జూన్ 23 (ప్రజాపాలన ప్రతినిధి): భారతీయుల ఐక్యత కోసం పాటుపడిన మహా వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బిజెపి నరసరావుపేట అసెంబ్లీ కన్వీనర్ రంగి శెట్టి రామకృష్ణ అన్నారు భారతీయ జనతాపార్టీ పూర్వ రూపమైన జనసంఘ్ సంస్థాపక అధ్యక్షులు,జాతి సమైక్యత కోసం పోరాడిన మహావ్యక్తి, కీర్తిశేషులు శ్రీ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 70 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన భారతీయ జనతా పార్టీ నరసరావుపేట పట్టణ నాయకులు. శుక్రవారం స్వర్గీయ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 70 వ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు వీరమళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి భారతీయ జనతా పార్టీ సభ్యులు పూల మాలలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు దేశం కోసం చేసిన ఉద్యమాల గురించి పలువురు నాయకులు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసరావుపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు వలన ప్రజాశ్రేయస్సు కు భంగం వాటిల్లితే సొంత ప్రభుత్వం మీదే ప్రశ్నించిన వ్యక్తి ముఖర్జీ . కాశ్మీర్ అంశంలో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి విధానాలను మార్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్టికల్ 370 రద్దు చేయాలని తీవ్ర ప్రయత్నం చేశారులి. భారతదేశంలో అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూడాలని ప్రజల హక్కులు వారి జీవన%శీ% దేశమంతా ఒకే విధంగా ఉండాలని , జాతీయ జెండా,జాతీయ గీతం ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఆయన జీవన ప్రయాణంలో వ్యక్తిగత స్వార్థం పక్కనపెట్టి భారతీయుల ఐక్యత కోసం పాటుపడి , జాతీయ సమైక్యత భారత దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెళుతుందని ప్రజలకు తెలియజేసిన మహావ్యక్తి శ్యాంప్రసాద్ ముఖర్జీ అని తెలియజేశారు.ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇత్తడి కిరణ్ మాట్లాడుతూ గౌరవ ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన పథకాలు మేకిన్ ఇండియా , ముద్ర యోజన, మరియు అనేక రకాల పథకాలకు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆలోచనా విధానము ఆయన ఆశయాలు స్ఫూర్తి అని ఎన్నో సార్లు తన ప్రసంగంలో చెప్పటం శ్యాంప్రసాద్ ముఖర్జీ కి దేశం పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనం అని తెలియజేశారు.సీనియర్ నాయకులు కాకుమాను వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టికల్ 370 ని రద్దు చేయటం ద్వారా నరేంద్రమోదీ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదానానికి ఒక అర్థం కల్పించి వారికి ఆత్మకు శాంతి చేకూర్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ కోశాధికారి కోట వెంకట కేశవ సత్యనారాయణ, సత్తెనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం జగనన్న సురక్ష కార్యక్రమం: కలెక్టర్




మచిలీపట్నం కలెక్టరేట్ జూన్ 23: ప్రజాపాలన :జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి .రాజాబాబు జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి 2019లో ప్రభుత్వం స్పందన కార్యక్రమం ప్రవేశపెట్టిందని అన్నారు. స్పందనలో పరిష్కారం కానీ సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి ద్వారా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందనీ అన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు పథకాలు పొందలేక మిగిలిపోయి ఉంటే అట్టి వారిని గుర్తించి వారి సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఈరోజు ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నెలరోజుల పాటు నిర్వహించనున్నారని అన్నారు. జిల్లాలో ప్రతి గ్రామ /వార్డు సచివాలయ పరిధిలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కూడిన బృందం నేటి నుండి ప్రతి ఇంటిని సందర్శిస్తారనీ అన్నారు. అర్హులై ఉండి ఎవరైనా లబ్ధి అందని వారు ఉంటే గుర్తించి సమస్య పరిష్కారానికి కావలసిన పత్రాలను సేకరిస్తారని, ధ్రువీకరణ పత్రాలు అవసరమైతే వాటిని పొందుటకు ప్రతి సచివాలయ పరిధిలో నిర్ణయించిన తేదీ నాడు జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తారనీ, ఈ శిబిరంలో సంక్షేమ పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని, అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేస్తారని అన్నారు. ఈ విధంగా 11 రకాలైన సేవలకు ఎలాంటి సేవా రుసుం లేకుండా ఉచితంగా అందజేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ ఎం వెంకటేశ్వర్లు, ముడ చైర్పర్సన్ బి. నాగ లక్ష్మి దుర్గ భవాని, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, కే ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి శివ నారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, డి ఎల్ డి వో సుబ్బారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఏ శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ఆరోగ్య సంక్షేమ సహాయం మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ కృష్ణా జిల్లా సందర్శన



మచిలీపట్నం జూన్ 23: ప్రజాపాలన : . కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీయ ప్రవీణ్ పవర్ శుక్రవారం ఉదయం మచిలీపట్నం సందర్శించారు. వీరి వెంట బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఉన్నారు. భారతీ ప్రవీణ్ పవార్ కి నగరంలోని బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రముఖ న్యాయవాది బందర్ నియోజకవర్గ ఇన్చార్జి సోడిశెట్టి బాలాజీ రావు, పంతం వెంకట గజేంద్రరావు, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. తదుపరి మంత్రి మోపిదేవి వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. నాగేంద్ర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధికారులు, మంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ,ప్రముఖ న్యాయవాది బందరు నియోజకవర్గ ఇన్చార్జి సోడిశెట్టి బాలాజీ రావు, చిరువోలు బుచ్చిరాజు,పంతం నాగ వెంకట గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద జ్యూట్ మిల్ భూములను కొనుగోలు చేసి నష్టపోవద్దు: టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి జూన్ 23 :తగరపువలస: కోర్టు వివాదాల్లో వున్న చిట్టివలస జ్యూట్ మిల్ భూములను కొనుగోలు చేసి ప్రజలు నష్ట పోవద్దని టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్ అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస కొత్త పేట లోని టీడీపీ వార్డు కార్యాలయం లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించకుండా ఆస్తులను అమ్మకం చేస్తున్న మిల్లు యజమానిపై వివిధ కోర్టు ల్లో పలు కేసులు వున్నాయని, ఇందులో ఏడు కేసుల్లో అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది అని అన్నారు. అయినప్పటికీ దళారులు ప్రమేయంతో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ లు వేస్తూ వాటిలో లొసుగులను కప్పిపుచ్చుతూ అమాయక ప్రజలకు వీటిని అధిక ధరలకు అంటగట్టి మోసం చేస్తున్నారని ఆరోపించారు. మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కై దళారీలు అమ్ముతున్న ఈ భూముల్లో ప్రభుత్వ బంజర్లు, నదీ గర్భాలు , చెరువులు కోనేరులు , గ్రామకంఠం స్థలాలు ఉన్నాయన్నారు. ఈ భారీ భూ కుంభకోణం అధికార పార్టీ కనుసనల్లోనే జరుగుతుందన్నారు. చిట్టివలస జూట్ మిల్ యాజమాన్యం చేస్తున్న ఈ భూకబ్జాలు అన్నింటికీ అధికార యంత్రాంగం ఏ విధంగా సహకరిస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ పక్క నష్టపరిహారం చెల్లించకుండా కార్మికులను ఇప్పటికే మోసం చేసిన యాజమాన్యం, ఇప్పుడు కొత్తగా ఆస్తుల అమ్మకం పేరిట అనేక మంది ప్రజలను కూడా దారుణంగా మోసం చేస్తున్న విషయాన్ని ఆధారాలతో సైతంగా జిల్లా కలెక్టర్కు మరియు ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలు ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండి వివాదాస్పద స్థలాలు కొని మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న జూట్ మిల్ క్వార్టర్ నుంచి కార్మిక కుటుంబాలను ఖాళీ చేయించాలని యాజమాన్యం చూడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న ఈ క్వాటర్లపై మిల్లు యాజమాన్యానికి ఎలాంటి హక్కు లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్వార్టర్లో నివాసం ఉంటున్న కార్మికుల కుటుంబాల జోలికి వస్తే ఖబర్దార్ అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ఒకటో వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, రెండోవార్డ్ అధ్యక్షుడు బడిగంటి నీలకంఠం, సీనియర్ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, తమ్మిన సూర్యప్రకాశ్ , పిల్ల రాజేష్, జోగ సన్యాసిరావు, దిండి వెంకటేష్, మద్దిల సుబ్బారావు , పల్లా అప్పల కొండ, అడ్డగర్ల రవి కుమార్ , పిట్టా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు సి సి ఆర్ సి పొందాలి డిబిఆర్సీ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప.




పల్నాడు జిల్లా. సత్తెనపల్లి. జూన్ 23 (ప్రజాపాలన ప్రతినిధి)దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారి ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం యల్లమంద, గురవాయపాలెం మరియు ఇక్కుర్తి గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు మరియు పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప గ్రామ సమావేశాలలో పాల్గొని ఎస్సీ,ఎస్టీ కౌలు రైతులుకు సి.సి.ఆర్సి కార్డులు ద్వారా పొందే సబ్సిడీ విత్తనాలు,ఎరువులు మరియు బ్యాంక్ రుణాలు పై అవగాహన కల్పించారు, ఈ కార్డుల పొందటం ద్వారా ఆర్థిక స్థితిగతులు కొంత మెరుగు పడతయని తెలిచేస్తు కౌలు రైతులందరూ వేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలనరు అనంతరం దళిత వాడల్లో ప్రచార సాధనం ద్వారా ప్రచారం చెపిస్తు రైతులకు కరపత్రాలు అందచేశారు,ఈ ప్రచార కార్యక్రమంలో డి.బి.ఆర్సి సిటీ కోఆర్డినేటర్ వేణు,అగ్రికల్చర్ అసిస్టెంట్లు సాయినాథ్,షహీద్ మరియు ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు పాల్గొన్నారు

# ఉప్పరపాలెంలో జరిగిన సంఘటన చాలా బాధాకరం



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 23: హామీల అమలుపై కేసన ఆరా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిగ్రామంలో జరిగిన సంఘటన జిల్లాలో మరోసారి పునరావృతం కాకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్ లో కలెక్టర్ రంజిత్ బాషాను, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకూల్ జిందాల్ ను శుక్రవారం ఆయన కలిశారు. చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో జరిగిన సంఘటన చాలా బాధను మిగిల్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థి అమర్ నాథ్ గౌడ్ ను దారికాసి హతమార్చడం దుర్మార్గమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో దోషులను వేగంగా శిక్షించాలని ఆయన కోరారు. నేరానికి పురిగొల్పిన వారిని కూడా దోషులుగా నిర్ధారించి చార్జీషీట్ లో వారి పేరును జతకలపాలని ఎస్పీని కోరారు. నేరానికి కారణమైన జెస్సి రెడ్డిని ఖచ్చితంగా పేరు జత చేయాలన్నారు. బాధిత కుటుంబానికి ఇస్తానన్న హామీలను వెంటనే చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, యువజన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, బాపట్ల, వేమూరు నియోజవర్గ అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, మురాల వాసుదేవ్, జిల్లా న్యాయ సలహాదారుడు నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్, పట్టణ కార్యదర్శి భాను తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో జోరుగా సాగుతున్న అరవింద బాబు మినీ మేనిఫెస్టో ప్రచార యాత్ర

**డా.చదలవాడ మినీ మేనిఫెస్టో ప్రచార యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన**

**మహిళలు మంగళ హారతులతో ఘనస్వాగతం**

**వానను సైతం లెక్కచేయకుండా సాగిన యాత్ర**

**టీడీపీతోనే గ్రామాభివృద్ధి**

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 23 (ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట మండలం యక్కలవారిపాలెం గ్రామంలో ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఇంటింటికి తిరుగుతూ వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా డా.చదలవాడ అరవింద బాబు టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రచార యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. మహిళలు మంగళహారతులతో, యువకులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో వానను సైతం లెక్కచేయకుండా డా.చదలవాడ అరవింద బాబు పాదయాత్ర జోరుగా సాగుతోందిబి ఈ సందర్భంగా డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.......స్వతంత్ర ప్రతిపత్తి గల గ్రామ స్వరాజ్యా న్ని జగన్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని డా.చదలవాడ అరవింద బాబు ఆరోపించారు.పంచాయతీరాజ్ వ్యవస్థను తుంగలో తొక్కుతూ... గ్రామ అభివృద్ధి నిధులను ఖజానాకు మళ్ళించి గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచారని డా.చదలవాడ అరవింద బాబు మండిపడ్డారు.గ్రామాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పల్లెటూరులే రాష్ట్ర అభివృద్ధికి పట్టుకొమ్మలని టీడీపీ ప్రభుత్వ హయంలో నారా చంద్రబాబు నాయుడు సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణం,స్మశాన వాటికలు,కళ్యాణ మండపాలు,షాదీ ఖానాలతో పల్లెటూర్లను అభివృద్ధి చేశారన్నారు.స్థానిక వైసీపీ ఎమ్మెల్యే గోపి రెడ్డి శ్రీనివాస రెడ్డి దోచుకోవడం,దాచుకోవడం తప్ప గ్రామాల అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు.సంక్షేమ పథకాల పేరుతో పావలా ఇచ్చి అధిక పనులు వేస్తూ పది రూపాయలు వసూలు చేస్తున్నారని జగన్ రెడ్డి చేసే మోసాన్ని ప్రజలకు వివరించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.మెజారిటీ ప్రజలు తెలిపిన సీసీ రోడ్ల డ్రైనేజీ సమస్యలను టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని డా.చదలవాడ హామీ ఇచ్చారు.టీడీపీ గ్రామాల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తోందని,ప్రజల మద్దతుతో రాబోయే రోజుల్లో టీడీపీ అధికారం చేపట్టబోతుందని డా.చదలవాడ అరవింద బాబు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారుపల్లి విశ్వేశ్వరరావు,చిట్టిబోయిన కోటయ్య, చిట్టిబోయిన అంజయ్య,వసంత ఎలమంద,శివ లక్ష్మయ్య, యంపరాల ఖాసీం,పెంట్యాల శివ,శివనాగు మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కరిముల్లా జ్ఞాపకార్ధం వృద్ధాశ్రమాలలో పండ్లు, రొట్టెలు పంపిణీ



పొన్నూరు జూన్22( ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షేక్ కరిముల్లా సంస్మరణ సభ స్థానిక షాదీ ఖానా లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పొన్నూరు జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులతో పాటు ఆయన తనయుడు మాజీ కౌన్సిలర్ ,వైసీపీ నాయకుడు షేక్ నయుం భాషా, అసోసియేషన్ అధ్యక్షుడు తోట రాంబాబు సభ్యులు కలిసి విద్యానగర్, కసుకర్రు రోడ్డులో ఉన్న అమ్మ ఆశ్రమంలో రొట్టెలు, పళ్ళు పంచిపెట్టారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించడమే లక్ష్యం: ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్వీ ప్రసాద్



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి: అంతరిక్ష పరిశోధన, సంబంధిత శాస్త్ర రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. నగరంలోని మేనర్ ఫుడ్ ప్లాజాలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో మంచి భవిష్యత్తు ఉన్నందున, విద్యార్థులు రాణించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యతలతో వారిని సన్నద్ధం చేయడం మన బాధ్యత అని వెల్లడించారు. స్పేస్ కిడ్జ ఇండియా సహకారంతో ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25వ తేదీ ఆదివారం నాడు అంతరిక్ష, అంతరిక్ష అన్వేషణపై అవగాహన కల్పించేందుకు అధిక ఎత్తులో ఉండే బెలూన్ ను సిద్దం చేశామని తెలిపారు. చిన్న ఉపగ్రహాలు, స్పేస్ క్రాఫ్ట్ లు, గ్రౌండ్ సిస్టమ్ రూపకల్పనలో స్పేస్ కిడ్జ భారతదేశంలోనే అగ్రగామిగా ఉందని చెప్పారు. విద్య పరిశోధన, పరిశ్రమల అవసరాలను తీర్చడానికి అంతరిక్షంలో ఆర్థిక, స్థిరమైన లక్ష్యాలను సాధించడం వారి లక్ష్యమని అన్నారు. 25 మంది విద్యార్థులతో కూడిన బృందంస్పేస్ సైన్సెస్, టెక్నాలజీ, నానో రీటిలైట్, ఎంబెడెడ్ సిస్టమ్ గురించి శిక్షణ పొందారని తెలిపారు. ఈ ఉషారామ శాట్ మిషన్ కు డైరక్టర్ గా అక్షయ్ విద్యార్థి బృందానికి నాయకత్వం వహిస్తున్నారని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉషారామ బృందాన్ని కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అభినందించారు. ఈ సమావేశంలో కళాశాల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె. యజ్ఞసాయి, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రిఫత్ షారూక్, ఉషారామ బెలూన్ శాట్ మిషన్ డైరెక్టర్ అక్షయ్, స్పేస్ కిడ్జ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పలు వార్డుల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్ నయుం అహ్మద్



పొన్నూరు జూన్23( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణంలోని 12, 13, 14, 15 వార్డులలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్ పారిశుధ్య పనులు తనిఖీ చేశారు. వార్డుల్లో మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులను పర్యవేక్షించి పలు సూచనలు అందించారు ప్రతి ఒక్క వార్డు కూడలిలో డబ్బాలు ఏర్పాటు చేసి వ్యర్థాలను దానిలో వేయాలని ప్రజలు కూడా డంపర్లను వినియోగించుకోవా రోడ్లమీద చెత్త వేయకుండా డంపర్లను వినియోగించాలని సూచించారు. వార్డు శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాదు కు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేసి ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడవలసిందిగా ఆదేశించారు. అనంతరం కంపోస్ట్ యార్ట్ పరిశీలించి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారు పంపించిన మిషనరీ తో కంపోస్ట్ యార్డ్ మొత్తం శుభ్రపరిచే విధంగా చూడవలసిందిగా శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ కు సూచనలు చేశారు. అలానే ఇంజనీరింగ్ సెక్షన్ లో వాటర్ ప్లాంట్ ను పరిశీలించి దాని చుట్టూతా ఉన్న పిచ్చి మొక్కల్ని తొలగించే విధంగా అలానే పాచి పట్టిన బెట్టిల్ని శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇటికంపాడు రోడ్లో యానాది సంఘం దగ్గర పెద్ద కాల్వ లో పూడికలు తీయుటకు వర్క్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు వెంకట్ దగ్గర ఉండి జెసిబి తో కాలవలో పూడికలు తీయించవలసిందిగా కమిషనర్ నయుం అహ్మద్ ఆదేశించారు.

## చెప్పింది చేయడమే సుపరి పాలన

### మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు




తెనాలి,ప్రజా పాలన ప్రతినిధి జూన్. 23: "చెప్పింది చేయడమే సుపరి పాలన" అని, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి ఆధ్వర్యంలో "సుపరిపాలన" జరుగుతోందని, రాష్టం అత్యంత ప్రశాంతంగా ఉందని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. వై.ఎస్.ఆర్ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో తెనాలి పెన్షనర్స్ హెూమ్ లో"సుపరిపాలన దిశ గా ఆంధ్ర ప్రదేశ్ రూపాంతరం" అంశం పై శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలు అమలు పరిచారా లేదా అనేది సుపరిపాలనకు గుర్తు గా భావించాల్సి వుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలను ఇప్పటికే 98 శాతం అమలుచేసిన సంగతిని ప్రజలందరూ గుర్తించారని అన్నారు.ప్రజల కోసం అమలుచేస్తోన్న సంక్షేమం కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు 45 వేల కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన చెప్పారు.తమ పార్టీ మినీ మేనిఫెస్టోగా ఇటీవల తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలకు లెక్క వేస్తే ఏటా 81వేల 600 కోట్లు ఖర్చు కాగలదని, అల్లాంటి సందర్భం లో ఆ కార్యక్రమాలు అమలు చేస్తే రాష్ట్రం శ్రీ లంక లా ఆర్థికంగా సంక్షోభంలో నెట్టివేయ బడదా అని ఆయన ప్రశ్నించారు.కొన్ని పత్రికలు, వాటి దుష్ప్రచారాలు ప్రజల్లోకి వెళ్ళకుండా అప్రమత్తతతో ప్రజలు వుండాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను తెలుసుకుని ఇటువంటి దుష్ప్రచారాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలి అని సూచించారు.తెలుగు అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ పత్రికలు, ప్రతిపక్షాలు కలసి నిర్వహిస్తోన్న దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్టం లోని 5 కోట్ల మంది లో 4కోట్ల మంది "నవరత్నాల" లబ్ది పొందారు అన్నారు. మీడియా పారదర్శకత పాటించడం లేదన్నారు.సమావేశానికి వై.ఎస్.ఆర్ మేధావులఫోరం అధ్యక్షులు జి. శాంత మూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో డా. కారుమంచి రవికుమార్. డా. ఆర్. జాన్ బాబు, కోపల్లి జయకర్, బొంతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పూర్తయిన ఎస్ జీ టి ఉపాధ్యాయులు కౌన్సిలింగ్



మచిలీపట్నం జూన్ 23: ప్రజాపాలన : కృష్ణా జిల్లా మచిలీపట్నంలో శుక్రవారం సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయులకు కాంట్రాక్టు పద్ధతి లో పనిచేసేందుకు నియమితులైన డి ఎస్ సి 2008,1998 ఉపాధ్యాయులకు డీఈవో కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఎస్సీ 2008 కి సంబంధించి 15 మంది 1998 సంబంధించి 192 మంది అభ్యర్థులు కౌన్సిలింగ్ హాజరయ్యారని తెలిపారు.

## "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు ప్రత్యేక ప్రసంగాలు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్. 23 : సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యం లో నిర్వహిస్తోన్న "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులతో పాటు, రాష్ట్రం లోని వర్కింగ్ జర్నలిస్టులకు ఆన్ లైన్ అవగాహనా తరగతుల్లో భాగంగా ఈ శనివారం (24-06-23) న "పరిపాలన సంస్కరణలు- గ్రామ,వార్డు సచివాలయాల పాత్ర" అంశం పై ఆ శాఖ డైరెక్టర్, డా. లక్ష్మీశా ఐ.ఏ.ఎస్. శనివారం ఉదయం 9నుంచి 10 గంటల వరకు ప్రత్యేక ప్రసంగం చేస్తారని ఆ సంస్థ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 26 వ తేదీ 2020 నుంచి డిసెంబర్ 2020 వరకు అంటే, 12 నెలల కాలంలో 1 కోటి, 60 లక్షల మంది పౌరులకు ఈ వ్యవస్థ సేవలు అందించిందని, ఢిల్లి కి చెందిన ఎలిట్ టెక్నో సంస్థ ప్రతిష్టాత్మక అవార్డు "ఎలిట్స్ నాలెడ్జి ఎక్సలెన్స్ సమ్మిట్ అవార్డు" ను పొంద గలిగిన ఈ గ్రామ,వార్డు సచివాలయాల గురించి అందరం తెలుసుకోవాలని చైర్మన్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే రోజు "మీడియా నాడు-నేడు" అనే అంశం పై ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ ప్రోగ్రాం హెడ్ ఆకుల మల్లేశ్వర రావు 8నుంచి 9గంటల వరకు " ప్రత్యేక ప్రసంగం ఇస్తారని, జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యా విధానంపై అవగాహన సదస్సు..



మచిలీపట్నం జూన్ 23: ప్రజాపాలన :స్థానిక ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం నందు ఉన్నత విద్యా మండలి ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా మచిలీపట్నం నందలి అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపక బృందం, కొత్తగా డిగ్రీలు చేరే అభ్యర్థులకు వారి తల్లితండ్రులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కే రామ్మోహనరావు ప్రధాన వక్తగా విద్యార్థిని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుత తరుణంలో ప్రపంచ ఉపాధి అవకాశాలకు పెంపొందించే దిశలో విద్యా మండలి నూతన డిగ్రీ హానర్స్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించింది. అందులో విద్యార్థులకు సుమారు 169 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయనివిద్యార్థులు ఎవరికి ఆసక్తికి అనుగుణంగా ఆ కోర్సులలో డిగ్రీ కోర్స్ తో పాటుగా వివిధ రంగాలలో ఒకసారి సర్టిఫికెట్ కోర్సులు కూడా పూర్తి చేయవచ్చునని రామ్మోహన రావు వివరించారు. అనేక ఉపాధి అవకాశాలను కల్పించే వివిధ కోర్సులను ఎంచుకోవచ్చు నాని దీనివల్ల కోర్సులను పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు తప్పకుండా వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ సి డి సి డాక్టర్ రామ్ శేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఏంజెల్ పాలకమండలి సభ్యులు చైర్మన్ ఎస్ వై ఎస్ ఆంజనేయులు, ఎం వెంకటేశ్వరరావు, ఎస్ భాస్కర్, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపక బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వైస్ ఛాన్సర్ ను ఘనంగా ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్ పక్షాన సత్కరించారు.

## జగనన్న సురక్ష పై అవగాహన సదస్సు



గోకవరం: ప్రజా పాలన జూన్: మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఎంఎల్ఓ వీరబాబు అధ్యక్షతన జగనన్న సురక్షపై గ్రామ వాలంటీలకు గృహ సారుదులకు కన్వీనర్ కు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోకవరం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పార్టీ రాంబాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎం ఎల్ ఓ వీరబాబు పాటి రాంబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం జగనన్న సురక్ష నూతన పథకాన్ని ప్రారంభించారని ఈ పథకంలో 11 రకాలైన సర్వీసులు ఉచితంగా లబ్ధిదారునికి మంజూరు చేయబడతాయని తెలిపారు ఈ కార్యక్రమం ఈనెల 24వ తేదీ నుండి ప్రారంభమవుతుందని మండల కన్వీనర్లు సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు ప్రజా ప్రతినిధులు ఇతర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమం పై శ్రద్ధ వహించి 11 రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారులు పొందుటకు ప్రజలను చైతన్యం పరచాలని కోరారు ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు గృహ సారథులు గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పాటి రాంబాబు

# తస్మాత్ జాగ్రత్త .... మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే.....

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**ఇ-టెండరు ప్రకటన నం DRM/ Works/SC/112-119/2023/OT తేది: 20.06.2023**

PUB/0676

భారత రాష్ట్రపతి తరుపున దిగువ సంతకందారుచే దిగువ పనుల కొరకు 17.07.2023న 14.00 గం.ల వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం. 01. ఇ-టెండరు నం: 112_CR_SC_23_OT, పని పేరు: WD-SC-KZJ సెక్షన్: (i) 5.093 కి.మీ ల మొత్తం పొడవు కొరకు బల్లాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు 30 సె.మీల నుండి బల్లాస్ట్ కుషన్ యొక్క సిటిఆర్ (పి) పెంపుదల మరియు రికూప్‌మెంట్ కలుపుకొని (ii) 5.773 కి.మీ ల మొత్తం పొడవు కొరకు టిఆర్ఆర్ (పి) (iii)DEN/Central/SC సెక్షన్ క్రింద 2.79 కి.మీల మొత్తం పొడవు కొరకు బల్లాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు 35 సె.మీ.లకు బల్లాస్ట్ కుషన్ పెంపుదల మరియు రికూప్‌మెంట్ కలుపుకొని టిఎస్ఆర్ (పి) **సుమారు విలువ:** రూ.1,86,69,236/-, **బయానా :** రూ.2,43,400/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 09 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 45(రోజులు)

క్ర.సం. 02. ఇ-టెండరు నం: 113_CR_SC_23_OT, పని పేరు: SW 1) SC-KZJ సెక్షన్: రఘునాదపల్లి వద్ద ట్రాక్ మిషన్ సైడింగ్ కొరకు కొత్త లైన్ వేయుటతో కనెక్షన్‌లో ఉదాహరణ: బ్రిడ్జి నం 406 DN 1X3.00m RCC Slab as 1x3.00x2.575m RCC Box యొక్క విస్తృత ప్రతిపాదన SW 2) HSJ-HYB సెక్షన్: హెచ్‌వైబి స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (పబ్లిక్ గార్డెన్ ఎఫ్ఓబి) ముగించడానికి ఎండ్ యొక్క తొలగింపు SW 3) SC-KZJ సెక్షన్: ADEN/N/KZJ అధికార పరిధి క్రింద SSE/W/N/KZJ లోని స్ట్రక్చరల్ మెంబర్స్ మరియు డివిఎస్ షెడ్ క్రేన్ గాన్ట్రీ గ్రైండర్ యొక్క పూర్తి పేంటింగ్ (**సుమారు విలువ:** రూ.77,32,821/-, **బయానా :** రూ.1,54,700/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 06 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 36

క్ర.సం. 03. ఇ-టెండరు నం: 114_CR_SC_23_OT, పని పేరు: SC-KZJ సెక్షన్: DEN/Central అధికార పరిధి క్రింద ADEN/N/KZJ సబ్ డివిజన్‌లోని SSE/W/N/KZJ సెక్షన్‌లోని ఇతర సర్వీసు బిల్డింగ్‌లు మరియు ఒహెచ్ఇ డిపోలోని ఒహెచ్ఇ టవర్ కార్‌షెడ్, స్టోర్ షెడ్లుకు రిపేర్లు **సుమారు విలువ:** రూ.73,94,924/-, **బయానా :** రూ.1,47,900/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 08 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 06

క్ర.సం. 04. ఇ-టెండరు నం: 115_CR_SC_23_OT, పని పేరు: SC-KZJ సెక్షన్: ADEN/NORTH/KZJ సబ్ డివిజన్ క్రింద SSE/P.Way/CR/KZJ సెక్షన్ క్రింద అప్ & డౌన్ లైన్ సైడ్‌పై సెన్‌కు రిపేర్ల ప్రతిపాదన. **సుమారు విలువ:** రూ.67,98,012/-, **బయానా :** రూ.1,36,000/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 12 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 03

క్ర.సం. 05. ఇ-టెండరు నం: 116_N_SC_23_OT, పని పేరు: PDPL-NZB సెక్షన్: PDPL & LPJL స్టేషన్ మధ్య ప్రస్తుత ఫార్మేషన్ యొక్క సబ్ బ్యాంకు మరియు సెస్‌కు రిపేర్ల ప్రతిపాదన. **సుమారు విలువ:** రూ.1,94,31,421/-, **బయానా :** రూ.2,47,200/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 12 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 03

క్ర.సం. 06. ఇ-టెండరు నం: 117_N_SC_23_OT, పని పేరు: BPQ-KZJ సెక్షన్: ADEN/RDM సబ్ డివిజన్ క్రింద RDM&MCL యార్డ్ వద్ద అప్ & డౌన్ లైన్స్ మధ్య సెంట్రల్ డ్రైన్ యొక్క ఏర్పాటు మరియు అప్ & డౌన్ లైన్స్ మధ్య సెంట్రల్ డ్రైన్‌కు రిపేర్ల ప్రతిపాదన. **సుమారు విలువ:** రూ.1,41,30,470/-, **బయానా :** రూ.2,20,700/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 06 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 36

క్ర.సం. 07. ఇ-టెండరు నం: 118_N_SC_23_OT, పని పేరు: PDPL-NZB సెక్షన్: Sr.DEN/NORTH/SC సెక్షన్ క్రింద ADEN/KRM సెక్షన్ క్రింద కి.మీ : 171/1 నుండి 172/5 @రిటేనింగ్ వాల్. **సుమారు విలువ:** రూ.74,95,689/-, **బయానా :** రూ.1,50,300/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 06 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 36

క్ర.సం. 08. ఇ-టెండరు నం: 119_W_SC_23_OT, పని పేరు: ADEN/Bidar అధికారపరిధిలోని స్టాఫ్ క్వార్టర్లలోని లీకే రూఫ్స్, డోర్స్ మరియు కిటికీలు, ఫ్లోరింగ్స్, ప్లాస్టరింగ్, వరండ షెడ్, టాయిలెట్లు, వగైరాలకు రిపేర్లు. **సుమారు విలువ:** రూ.1,55,87,278/-, **బయానా :** రూ.2,28,000/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 06 నెలలు, **నిర్వహణ కాలం నెలల్లో:** 06

1. టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
2. కాగోరు టెండరుదారులందరూ బయానా (వర్తించినచో)ను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నారు.
3. ఏ కారణం తెలుపకనే టెండరును రద్దు చేయు హక్కు రైల్వే కలిగి ఉంది.
4. కాగోరు టెండరుదారులందరూ GSTIN గుర్తింపు నంబర్లు పొంది వారి ఆఫర్లతోపాటు దాఖలు చేయవలెను.

Sr. DEN / కో-ఆర్డినేషన్ / సికింద్రాబాద్

**టెండరు నం.BZA-GSU-Elec-13-2023-24, తేది:21.06.2023**

PUB/0681

భారత రాష్ట్రపతి తరపున, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు బహిరంగ/సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.: 01 **టెండరు నం.:** BZA-GSU-Elec-13-2023-24, తేది: 21.06.2023, **పని వివరణ:** విజయవాడ డివిజన్‌లో గతి శక్తి యూనిట్ కొరకు జనరల్ కన్సల్టెంట్ (జిసి) నియామకం. **టెండరు విలువ:** రూ.22734441.00, **బయానా:** రూ.263700, **పూర్తి చేయాల్సిన కాలం:** 36 నెలలు, **టెండరు ఫారం ధర:** రూ.లేదు, **ముగింపు తేది మరియు సమయం:** 31.07.2023న 15.00 గం.కు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలు కొరకు వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2. బయానా మరియు టెండరు డాక్యుమెంట్ ధరను IREPS లో అందుబాటులోని నెట్ బ్యాంకింగ్/పేమెంట్ గేట్ వే వంటి వాటి ద్వారా మాత్రమే చెల్లించవలెను.
3. టెండరుదారు టెండరు ముగింపు కాలం అయినట్టి సదరు పదిహేను రోజుల కాలం లోగా మాత్రమే వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను.
4. టెండరుదారు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు ప్రారంభ కాలం తేది వరకు గమనించగలరు.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / గతిశక్తి, విజయవాడ

A0953

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

**మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందికి జైలు శిక్షా మరియు జరిమానా విధించిన న్యాయస్థానం వారు**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమీషనర్ శ్రీ క్రాంతి రాణా టాటా, ఐ.పి.ఎస్ వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగినది. ఈ నేపథ్యంలో ది.23-06-2023 వ తేదిన 3వ ట్రాఫిక్ పోలీసు వారు 16 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, గౌరవ మేజిస్ట్రేట్ శ్రీ కె.సురేష్ బాబు గారు ఈ క్రింది విధంగా జైలు మరియు జరిమానా విధించడం జరిగింది.

ఇద్దరు వ్యక్తులకు 22 రోజుల జైలు మరియు ఒకొక్కరికి రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 20 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 19 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా,

ఇద్దరు వ్యక్తులకు 18 రోజుల జైలు మరియు ఒకొక్కరికి రూ.10,000/- జరిమానా,

ఇద్దరు వ్యక్తులకు 15 రోజుల జైలు మరియు ఒకొక్కరికి రూ.10,000/- జరిమానా,

నలుగురు వ్యక్తులకు 12 రోజుల జైలు మరియు ఒకొక్కరికి రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 10 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 08 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 05 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా,

ఒక వ్యక్తికి 03 రోజుల జైలు మరియు రూ.10,000/- జరిమానా విధించడం జరిగింది.

ఎక్కువ ప్రమాదాలు మద్యం సేవించి వాహనం నడవడం వలన జరుగుతున్నాయి. ఒక ప్రమాదం వలన ఎన్నో కుటుంబాలు చిన్నా బిన్నం అవుతున్నాయి. ఒక వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదం చేయడం వలన తనతోపాటు ఎదుటి వ్యక్తి మరియు అతని కుటుంబం ఇబ్బందులు పడటం జరుగుతుంది. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడి జైలుకు వెళితే విద్యార్థులు వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఫారెన్ పాస్ పోర్ట్ వంటి విషయాలలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వుంటుంది మరియు ఉద్యోగస్తులు వారి ఉద్యోగాల నుండి తొలగించే ప్రమాదం వుంది. కోర్ట్ వారు కుడా మద్యం సేవించి వాహనములు నడపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఐ.పి.ఎస్. తెలియజేయటం జరిగింది.

# అమ్మ ఒడి అని 15000 ఇచ్చాడు... నాన్న బుడ్డి పేరుతో 25000 దోచేస్తున్నారు



పల్నాడు జిల్లా.నరసరావుపేట. జూన్ 23 (ప్రజా పాలన ప్రతినిధి): తెలుగుదేశంపార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "భవిష్యత్తుకు గ్యారెంటీ" మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) నరసరావుపేటలో చేపట్టిన "మార్నింగ్ టీ విత్ నల్లపాటి" 3వ రోజు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఉదయం పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులోని బాబాపేట్ లో నల్లపాటి రాము పర్యటించారు. స్థానికులతో కలిసి టీ దుకాణం వద్ద టీ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీలోని పథకాలను వారికి తెలియజేసి భరోసా కల్పించారు. పర్యటనలో భాగంగా నల్లపాటి రాము పట్టణంలోని 6వ వార్డులో ఉన్న హెూల్ సేల్ కూరగాయల మార్కెట్ ను సందర్శించారు. తెలుగుదేశంపార్టీ హయాంలో ఈ కూరగాయల మార్కెట్ లో షాప్ లు కేటాయించడం జరిగిందన్నారు. మునిసిపాలిటీ వాళ్లు దుకాణదారులందరి దగ్గర నుండి షాప్ కు రూ.4 లక్షలు డిపాజిట్ క్రింద కట్టించుకుని నెలకు రూ.4 వేలు అద్దె వసూలు చేస్తున్నారు కానీ కనీస వసతులను కల్పించడం మాత్రం మరిచారని దుయ్యబట్టారు. మార్కెట్ లో రైతులు, వ్యాపారులు టాయిలెట్ లకు వెళ్లాలన్నా ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీసం మంచినీటి సదుపాయం కూడా అందించలేని దుస్థితికి మార్కెట్ ను తీసుకువచ్చారని అధికారులపై, అధికారపార్టీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మార్కెట్ లో పరిస్థితిని కలెక్టర్, మునిసిపల్ కమీషనర్ ల దృష్టికి తీసుకువెళ్తానని, వారు సరైన రీతిలో స్పందించని పక్షంలో పోరాటానికి కూడా సిద్ధమని దుకాణదారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, మాజీ కౌన్సిలర్ గద్దం కరీముల్లా, పొన్నగంటి కృష్ణ, తాళ్లూరి రాజేంద్ర, అరబోలు శివ, అరబోలు దుర్గారావు, పెనుబాకుల వెంకట్రావు, మాజీ వార్డ్ ప్రెసిడెంట్ షేక్ మీరావలి, షేక్ మస్తాను, పట్టణ ఐటీడీపీ సెక్రటరీ పటాన్ నజీర్, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరికల రాయప్ప, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మాదిగల జన జాగృతి మహాసభను విజయవంతం చేయండి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశల మేరకు చిలకలూరిపేట నియోజకవర్గం అంబేద్కర్ భవన్ లో పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి కోట సుబ్బు మాదిగ అధ్యక్షతన జులై 7 న విజయవాడ గాంధీనగర్ జింఖానా గ్రౌండ్ లో జరగబోవు మహాసభ విజయవంతం చేయాలని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఎటుకూరి విజయ్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఈ గ్రామం నుండి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే గత 28 సంవత్సరాలుగా ఎస్సి లలో ఏబిసిడి వర్గీకరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్రంలో మాదిగ మాదిగ ఉప కులాలను ఓటర్లగానే వినియోగించుకొని నిర్లక్ష్యం వహిస్తున్న బిజెపి వైఎస్ఆర్సిపి టిడిపి పార్టీలు ప్రస్తుత అధికార పార్టీ నాయకత్వం రాబోవు రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకో తప్పదని హెచ్చరించారు. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో మాదిగలకు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఈపూరి రాంబాబు మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పర్సిపోగు శ్రీనివాస్ రావు మాదిగటౌన్ అధ్యక్షులు తాతపూడి యేసు మాదిగ మండల కన్వీనర్ తమ్ములూరి ఇశ్రాయేలు మాదిగ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి గోళ్లమూడి రాజశేఖర్, ప్రత్తిపాటి మరియాదాసు తదితరులు పాల్గొన్నారు .

## ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జేఎన్‌టియు కాంట్రాక్ట్ ఉద్యోగులు



నరసరావుపేట, ప్రజాపాలన ప్రతినిధి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంటాక్ట్ ఉద్యోగులు నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాన్ రెడ్డి కలిసి వారి సమస్యను తెలియజేశారు. స్థానిక జేఎన్టీయూ కళాశాల లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు శుక్రవారము నరసరావుపేట ఎమ్మెల్యే డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు కాంట్రాక్టు ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు మణికంఠ తెలిపారు, ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఆర్థికపరమైన ఇబ్బందులతో జీవితాలను గడుపుతున్నామని విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు కనీసా వేతనాలు చెల్లించాలని , ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు కంటే ఎక్కువ అర్హత వున్నపటికి మాకు అతి తక్కువ వేతనం వస్తుంద ని కావున త మకు పే స్కేల్ ప్రాకారం క నిస వేతనము ఇచ్చెల సిఫరసు చేయలని వినతిపత్రం అందజేశారు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చార అని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ అధ్యక్షులు పోట్ల మణికంఠ, కార్యదర్శి సిహెచ్.రాకేష్, వి.హరికృష్ణ, ఉపాధ్యక్షుడు కె. చైతన్య , సాయి ప్రసాద్, సతీష్ త ధీతరులు పాల్గొన్నారు

## నరసరావుపేట పట్టణంలో ఇష్టారాజ్యంగా స్కూలు ఫీజులు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 23. (ప్రజాపాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో స్కూలల్లో అధిక ఫీజులు అరికట్టాలి ప్రైవేట్ స్కూల్లో అధిక ఫీజులు మరియు డ్రస్సులు మెటీరియల్ పేరుతో దోపిడిని అరికట్టాలని సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసారాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో ఎంఈఓ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకి సిపిఐ పట్టణ కార్యదర్శి వైదనవెంకట్ అధ్యక్షత వహించగా.. కాసా రాంబాబు మాట్లాడుతూ పట్నంలో ప్రైవేట్ స్కూలు కార్పొరేట్ స్కూలు పోటీపడి పేద మధ్యతరగతి ప్రజల వద్ద విచ్చలవిడిగా విద్యార్థులు తల్లిదండ్రుల తల్లిదండ్రుల వద్ద ఫీజులు దోపిడీ చేస్తున్నారని ఆయన అన్నారు మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటి తీసుకు వచ్చినప్పటికీ ఏ ఒక్క ప్రైవేట్ స్కూల్ కూడా అమలు చేయడం లేదని ఐదు స్టేర్లు స్టేర్లు బిల్డింగులు కట్టి కనీసం లిఫ్ట్ సౌకర్యం గాని గ్రౌండ్ సౌకర్యం గాని లేవని మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాఈ తక్షణమే డీఈవో ఎంఈఓ సంబంధిత అధికారులు ప్రైవేట్ స్కూల్లో పైన నిగా ఉంచాలని ఆయన అన్నారు లేని పక్షాన పెద్ద ఎత్తున సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య సిపిఐ నాయకులు ఎస్.కె చిన్న జాను సైదా వాద్య నాయక్ ఆనందు జగన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు అనంతరం ఎంఈఓ ఎస్ నాగేశ్వరరావు కి వినతి పత్రం సమర్పించారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట జూన్ 23 ప్రజా పాలన ప్రతినిధి తెలు గుదేశం పార్టీ చేపట్టిన భ విష్యత్తుకు గ్యారంటీ కార్య క్రమంలో భాగంగా శుక్రవా రం మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పట్టణంలోని 12వ వార్డు వి ద్యానగర్ కాలనీలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయ కులతో కలిసి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తాత య్య మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు వార్డులో ఇంటింటికి వెళ్లి, జగన్మోహన్ రె డ్డి చేస్తున్న దుర్మార్గపు పాలన గురించి వివరించి, అ దేవిధంగా టిడిపి వస్తే సామాన్య ప్రజానీకానికి జరిగే మేలులను వివరించి, తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్ర కటించమని కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ తెలు గుదేశం పార్టీ అ ధ్య క్షులు మేక వెంకటేశ్వర్లు, పట్టణ తె లుగుదేశం పార్టీ సెక్రటరీ మైనేని రాధాకృష్ణ,12 వ వా ర్డు కౌన్సిలర్ వే దులాపురి అలేఖ్య సైద, అచ్చయ్య త మ్మిశెట్టి నర సింహారావు, గంజన బోయినశ్రీను దాసరి నాగరాజు, పబ్బతి విజయలక్ష్మి .

## రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు కృషి ప్రశంసనీయం





చందర్లపాడు జూన్ 23 ప్రజా పాలన ప్రతినిధి మం డల పరిధిలోని పొక్కునూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థా నిక ఎమ్మెల్యే మనితో ఒక జగన్మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆ ప్రాంత రైతులు రైతుల కోసం ఆయన చేసిన కృషిని ప్రశంసిస్తూ ఆయనకు ఘన సన్మానం చేశారు గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్ లో పంట నష్టపరిహారం కింద వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇప్పుడు సబ్సి డీని అందజేసిందిఎమ్మెల్యే కృషి ఫలితంగా చందర్ల పాడు మండలంలోని పొక్కునూరు గ్రామ రైతులతో పాటు పరిసర ప్రాంతాల్లో పంట నష్టం అందని సు మారు 200 మంది రైతులకు వైయస్ జగన్మోహన్ రె డ్డి ప్రభుత్వం గత మూడు రోజుల కిందట రూ.60 లక్షలను వారి ఖాతాల్లో జమ చేసిందిఈ కార్యక్ర మం లో కొమ్మినేని మహేంద్ర, ఎంపీటీసీ కటుకూరి వెంకట రత్నం, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు,యా ర్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, రాయల జానకి రామ య్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి**



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 23: రాష్ట్రంలో అర్హతకలిగి మిగిలి పోయిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 99శాతం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని పొరపాటున మిగిలి పోయిన 1శాతం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోజూలై1వ తేదీ నుండి నాలుగు వారాలు పాటు మండల స్థాయి అధికారులు గ్రామ,వార్డు సచివాలయాలు పర్యటించి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అర్హులైన పేదలనుండి అర్జీలు తీసుకుని వాటిని పరిష్కరించి లబ్ధిదారులకు మేలుజరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు రాష్ట్రంలో వాలంటీర్లు , సచివాలయ సిబ్బంది ఇంతిఇంటికి తిరిగి కోటి అరవై లక్షల కుటుంబాల లబ్ధిదారులను కలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా నుండి ఎమ్మెల్సీ పోతుల సునీత, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణ మూర్తి, చీరాల నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కరణం వెంకటేష్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,జాయింట్ కలెక్టర్ సి.హ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, సి.పి.ఓ భరత్ కుమార్,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ ప్రసాద్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్,రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.



# బాలయ్య కు సైడ్ ఇచ్చిన బోయపాటి రాపో!

స్టైలిష్ గా కనిపిస్తూనే మాస్ పాత్రల తో అలరించే హీరో రామ్ పోతినేని. ఆయన కు ఉన్న క్రేజ్ వేరు. అభిమానులు ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా ఎప్పటికప్పుడు తన ఆహార్యాన్ని మార్చుకుంటూ.. విభిన్న పాత్రల తో మెప్పిస్తారు. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ గా.. లవర్ బాయ్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకున్నాడు. ప్రస్తుతం ఆయన మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీనివాస్ తో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.అయితే.. ఈ ఊర మాస్ డైరెక్టర్ అండ్ ఇస్మార్ట్ హీరో కలిసి చేస్తున్న సినిమా బోయపాటి రాపో అనే వర్కింగ్ టైటిల్ తో షూటింగ్ జరుపుకుంటోంది. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ రిలీజ్ అయింది. ఇక ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం ఈ సినిమా టైటిల్ స్కంధ అని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. త్వరలో ఈ టైటిల్ కి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే




అవకాశం ఉందట. అక్టోబర్ నెలలో దసరా కానుకగా బోయపాటి రాపో సినిమా ని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేసారు.తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం... అక్టోబర్ నుంచి సెప్టెంబర్ నెలకి ఈ సినిమా కి ప్రీ పోన్ చేసారట. అక్టోబర్ 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 15కి బోయపాటి రాపో సినిమా ని ప్రీపోన్ చేసారు. చెప్పిన డేట్ కన్నా ముందు సినిమాని రిలీజ్ చెయ్యడం గొప్ప విషయమే కానీ ఈ రిలీజ్ డేట్ ముందుకి రావడం వెనక బాలయ్య కారణంలా కనిపిస్తున్నాడు. బాలయ్య-అనీల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న మూవీ భగవంత్ కేసరి. ఈ సినిమా ను దసరా కు అక్టోబర్ 21వ తేదీన రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమా లో బాలయ్య పోలీస్ ఆఫీసర్ గా నటించనున్నాడు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ కి కూడా సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.బోయపాటి రాపో సినిమా బాలయ్య సినిమా ఒక రోజు తేడా తోనే థియేటర్స్ లోకి వస్తున్నాయి.

రెండు మాస్ సినిమాలు ఒకరోజు తేడా తో థియేటర్ లో రిలీజ్ చేయడం ఎందుకు అనుకున్నారో.. లేదా బోయపాటి బాలయ్య కోసం రిలీజ్ డేట్ ను ప్రీపోన్ చేశాడో తెలియదు. ఇక బాలయ్య బోయపాటి మధ్య మంచి అనుబంధమే ఉంది. ఈ నేపథ్యం లోనే మార్చి ఉంటారని అంటున్నారు.

# "దేవర" షూట్ పై లేటెస్ట్ అప్డేట్.!




గ్లోబల్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా బాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "దేవర" కోసం తెలిసిందే. మరి ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ గ్రాండ్ సక్సెస్ తర్వాత వస్తున్నా సినిమా ఇది కావడంతో ఈ భారీ సినిమాపై ఎనలేని హైప్ నెలకొంది.ఇక ఈ సినిమా షూటింగ్ అయితే పక్కా ప్లానింగ్ ప్రకారం నాన్ స్టాప్ గా జరుగుతూ ఉండగా గత కొన్నాళ్ల కితమే స్టార్ట్ అయ్యిన సినిమా నాలుగో షెడ్యూల్ అయితే ఇప్పుడు విజయవంతంగా మేకర్స్ కంప్లీట్ చేశారు. మరి ఇందులో తారక్ సహా సైఫ్ తదితర కీలక నటులు పాల్గొనగా కొరటాల భారీ యాక్షన్ సీక్వెన్స్ లను కూడా తెరకెక్కించినట్టుగా తెలుస్తుంది.ఇక దీనితో పాటుగా ఈ భారీ చిత్రం నెక్స్ట్ షెడ్యూల్ ని అయితే మేకర్స్ జూలై నుంచి స్టార్ట్ చేయనున్నారట. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ మరియు యువసుధ ఆర్ట్స్ వారు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు.

# శ్రీ విష్ణు 'సామజవరగమన' సెన్సార్ రిపోర్ట్!

చిన్న చిన్న క్యారెక్టర్ లు వేస్తూ హీరో స్థాయికి ఎదిగి కథలనే ఆధారంగా సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో శ్రీ విష్ణు. మెంటల్ మదిలో బ్రోచేవారెవరురా లాంటి సినిమాల ద్వారా మంచి సక్సెస్ తో పాటు గుర్తింపు కూడా సంపాదించాడు. ఫలితం ఎలా ఉన్నా కంటెంట్ ఉన్న కథలను ఎంచుకోవడంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటాడు. జయాపజాయలతో సంబంధంలేకుండా ప్రేక్షకులకు కొత్త తరహా కథలను పరిచయం చేస్తుంటాడు.కెరీర్ మొదటి నుంచి శ్రీవిష్ణు విభిన్న జానర్లలో ఎక్స్ పరిమెంట్ సినిమాలను చేస్తూ ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. చివరగా శ్రీవిష్ణు అల్లూరి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కానీ



ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న తాజా చిత్రం సామజవరగమన. పేరుకు తగ్గట్లే ఈ సినిమా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోంది.ఈ చిత్రాన్ని వివాహ భోజనంబు ఫేం రామ్ అబ్బ రాజు డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే మేకర్స్ లాంచ్ చేసిన సామజవరగమన గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది. ఈ సినిమా నుంచి విడుదల అయిన పోస్టర్స్ సాంగ్స్ కు మంచి ఆదరణ దక్కింది. ఇక ఈ సినిమాను జూన్ 29వ తేదీన థియేటర్లలో గ్రాండ్ గా విడుదల చేయనున్నారు.ఇక అదే రోజున నిఖిల్ పాన్ ఇండియా మూవీ స్పై థియేటర్లకు రానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు సినిమా పోటీ పడనుంది. తాజాగా ఈ సినిమా నుంచి సెన్సార్ అప్ డేట్ అందించారు మేకర్స్. ఈ చిత్రాన్ని వీక్షించిన సీబీఎఫ్సీ ప్యానెల్ క్లీన్ యూ సర్టిఫికెట్ ను జారీ చేసింది. అంటే ఫ్యామిలీ మొత్తం కలిసి చూొచ్చన్నమాట. ఇక ఈ మూవీలో బిగిల్ ఫేం తమిళ నటి రెబా మోనికా జాన్ ఫీ మేల్ లీడ్ రోల్ లో నటిస్తోంది. సామజవరగమనలో వెన్నెల కిశోర్ నరేశ్ శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ తో కలిసి హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. చ్డూడాలి ఇక ఈ సినిమా అయినా శ్రీవిష్ణుకు కమర్షియల్ హిట్టును అందిస్తుందో లేదో.

# నితిన్ లైనప్ లోకి ఆల్మోస్ట్ ఈ సినిమా.!

మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా ఇప్పుడు పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ లు చేస్తున్నాడు. ఇక వీటిలో దర్శకుడు వెంకీ కుడుముల తో అయితే మళ్ళీ సరికొత్త సినిమా చేస్తుండగా దీనిపై గట్టి హైప్ కూడా ఉంది. ఇక ఈ విధంగా నితిన్ లైనప్ మరింత ఆసక్తిగా మారుతుండగా ఇప్పుడు ఆల్ మోస్ట్ అయితే ఓ ఇంట్రెస్టింగ్ సబ్జెక్టు నితిన్ కి లాక్ అయినట్టుగా తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు వేణు శ్రీరామ్ అయితే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కోసం ఎప్పుడో రెడీ చేసుకున్న "ఐకాన్" సినిమానే ఇప్పుడు నితిన్ కి దాదాపు ఖరారు చేసినట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి నితిన్ కి తగ్గట్టుగా వేణు కొన్ని మార్పులు చేర్పులు అయితే చేసి రెడీ చేసాడని ఫైనల్ గా ఈ కాంబినేషన్ లో అయితే ఐకాన్ ఉండబోతుంది అని వినికిడి. మరి దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది.



# వర్మ "వ్యూహం" టీజర్ కి డేట్,టైం ఫిక్స్.!




సంచలనాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గత కొంత కాలం నుంచి పలు కాంట్రవర్సియల్ సినిమాలనే చేస్తున్న సంగతి తెలిసిందే. పైగా పొలిటికల్ గా అయితే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ ఆ తరహా సినిమాలే రామ్ గోపాల్ వర్మ తెరకెక్కిస్తూ ఉండడం విశేషం. మరి అలా లేటెస్ట్ గానే తాను అనౌన్స్ చేసిన మరో చిత్రమే "వ్యూహం" కాగా ఈ చిత్రం కూడా ఏపీ రాజకీయాలకి సంబంధించిన నేపథ్యంలోనే తెరకెక్కించబడింది.ఇక ఈ సినిమాపై వర్మ మార్క్ బజ్ అయితే ఉండగా ఇపుడు లేటెస్ట్ గా ఈ సినిమా టీజర్ కి వర్మ డేట్ అండ్ టైం ని అయితే అనౌన్స్ చేశారు. మరి ఈ సినిమా టీజర్ రేపు జూలై 24 ఉదయం 11 గంటలకి అయితే రిలీజ్ చేస్తున్నట్టుగా తెలిపారు. ఓ పొలిటికల్ బ్యాక్ డ్రాప్ పోస్టర్ తో ఈ అనౌన్సమెంట్ అందించారు. ఇక ఈ చిత్రంలో మెయిన్ లీడ్ గా అయితే అజ్మల్ అమీర్ నటిస్తుండగా దాసరి కిరణ్ కుమార్ నిర్మాణం వహిస్తున్నారు. ఇక ఈ టీజర్ వచ్చాక అయితే వర్మ ఎలాంటి సెన్సేషన్ సెట్ చేస్తారో చూడాలి.

# కాంతార 2 కోసం రిషబ్ ఏం చేస్తున్నాడో తెలుసా..!

గత సంవత్సరం ప్రేక్షకుల ముందుకు వచ్చిన కన్నడ మూవీ కాంతార ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కేజీఎఫ్ సినిమాను చూసిన ప్రేక్షకుల సంఖ్య కంటే కాంతార సినిమా ను చూసిన కన్నడ ప్రేక్షకుల సంఖ్య ఎక్కువ అంటూ కన్నడ మీడియా సంస్థలు కాంతార గురించి కథనాలు రాశాయి.చిన్న బడ్జెట్ సినిమాగా కేవలం కన్నడంలో మాత్రమే రూపొంది అక్కడే మొదట విడుదల అయ్యింది. తక్కువ సమయంలోనే వంద కోట్లకు పైగా వసూళ్ల నమోదు చేయడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తెలుగు



మరియు హిందీ ఇంకా ఇతర భాషల్లో డబ్ చేసి విడుదల చేయడం జరిగింది.కన్నడంతో పాటు అన్ని భాషల్లో కూడా కాంతార సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఆ సమయంలోనే కాంతార సినిమా కు మరో పార్ట్ ను చేయబోతున్నట్లుగా హీరోగా నటించి దర్శకత్వం వహించిన రిషబ్ శెట్టి ప్రకటించిన విషయం తెల్సిందే. రిషబ్ శెట్టి ప్రస్తుతం అదే పనిలో ఉన్నాడు.కాంతార సినిమాకు సీక్వెల్ అన్నట్లుగా కాకుండా ప్రీక్వెల్ గా కాంతార 2 రాబోతుంది. అంటే కాంతార లో చూపించిన కథకు ముందు జరిగిన కథ ను చూపించబోతున్నారు. కాంతార సినిమా ను లో బడ్జెట్ లో రూపొందించారు. కానీ కాంతార 2 ను భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమా కోసం రిషబ్ శెట్టి గుర్రపు స్వారీ ని నేర్చుకుంటున్నట్లుగా తెలుస్తోంది. సినిమాలో ఉండే కొన్ని సన్నివేశాల కోసం ప్రత్యేకంగా రెడీ అవుతున్నట్లు సమాచారం అందుతోంది. కన్నడ ప్రేక్షకులతో పాటు పాన్ ఇండియా ప్రేక్షకులు కాంతార 2 కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న విషయం తెల్సిందే.

జై భీమ్

బహుజనులు అంటే ఎవరు?
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్క మైనారిటీ SC,ST,BC,OC కులాల్లో ఉన్న ప్రజలందరు బహుజనులే

ఏకైక లక్ష్యం బహుజన రాజ్యాధికారం సాధించడమే

ఆలోచించండి!
➤2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO) వారు కులాల జనాభా నిష్పతి
➤BC 41%,SC 20%, ST 9%, OC 30%
➤ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్ BC 27%, SC15.5%,ST 7.5%, OC 50%
ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది

50% రిప్రజెంటేషన్
మహిళలకు 50% రిప్రజెంటేషన్ (రిజర్వేషన్స్) కల్పించడమే మా ధ్యేయం

బీసీలను సీఎం చెయ్యాలి
డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ చెప్పిన మాస్టర్ కీ ని సాధించడమే మా నినాదం
అధిక జనాభా ఉన్న BCని CM చేయాలనేది లక్ష్యం

మనం గెలవాలంటే MAM ను ఆచరించాలి
MAM అంటే
M : ఆశయా లకు, నీకు ,మద్దతు ఇచ్చే వాళ్ళని మెంబర్స్ గా చేసుకోవాలి, నిన్ను ఇష్టపడే వాళ్ళని నాయకుడిగా నామినేట్ చేయాలి
A : నిన్ను నీ కమిటీలను కాపాడటానికి అడ్వకేట్స్ కమిటీని పెట్టాలి
M : నిన్ను ప్రపంచానికి పరిచయం చేసి నాయకుడుగా గెలిపించడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మీ చేతిలో ఉండాలి

5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి MLA గా MLC గా ఉండాలని సమర్ధిస్తుంది

కుల రహిత సమాజం
డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోరుకున్న కులరహిత సమాజం కోరకు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు మరియు కులం వద్దు అనేవారికి సమతా కులం అని నమోదు చేయటానికి మద్ధతు.

శివ భాగ్య రావు బహుజన్,IRS-vrs
నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
జై పూలే | జై భీమ్ | జై బహుజన్ | జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.